



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఖమ్మం
భద్రాద్రి
కొత్తగూడెం

శుక్రవారం 06, మార్చి 2026


## విధి నిర్వహణలో నిర్లక్ష్యం
# సహించేది లేదు

-ప్రభుత్వ సంస్థల్లో ఆకస్మిక తనిఖీలు
-విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి
మణుగూరులో జిల్లా కలెక్టర్ సుడిగాలి పర్యటన



3 లో..


## వనం నుండి జనంలోకి
# పగిడిద్దరాజు



2 లో..

## అర్ధరాత్రి ఆపదొస్తే.. ఖమ్మం పరుగు తీయాల్సిన
# అవస్థలు ఇక ఉండవు!

- గిరిజన బిడ్డల ప్రాణాలకు మంత్రి పొంగులేటి భరోసా..
- తిరుమలాయపాలెంలో రూ. 26 కోట్లతో 100 పడకల ఏరియా ఆసుపత్రికి శంకుస్థాపన
- డిసెంబర్ కల్లా పనులు పూర్తి కావాలి.. కాంట్రాక్టర్‌కు ఆదేశాలు




2 లో..

**ఖమ్మం, బ్యూరో / తిరుమలాయపాలెం సూర్య (మేజర్‌న్యూస్)-** : "అర్ధరాత్రి వేళ ఆపద వస్తే.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఖమ్మం పరుగు తీయాల్సిన కష్టాలు ఈ ప్రాంత గిరిజన బిడ్డలకు ఇక ఉండవు. పేదవాడి సొంత గడ్డపైనే కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించడమే మన ప్రజా ప్రభుత్వ లక్ష్యం" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. గురువారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలో సుమారు రూ. 26 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొంగులేటి ప్రసంగించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

# వడ్డీకి వడ్డీలతో..వేధిస్తున్నారు

- అసలు కంటే వడ్డీనే ఎక్కువ చెల్లిస్తున్నాం
- ఆత్మహత్యలే శరణ్యమంటున్న బాధితులు
- వడ్డీ..చక్రవడ్డీ..బారువడ్డీలతో నలుగుతున్న సామాన్యులు

2 లో..



**మణుగూరుఆర్‌సి/పినపాక, సూర్య (మేజర్‌న్యూస్)-** పినపాక మండలంలో వడ్డీ..చక్రవడ్డీ..బారువడ్డీలు కట్టలేక సామాన్య ప్రజలు నలిగిపోతున్నారు.అసలు కంటే అధికంగా వడ్డీలు కట్టలేక ఆత్మహత్య చేసుకోవాలని అనిపిస్తోంది కొందరు బాధితులు ఆరోపిస్తున్నారు.

## పదవ తరగతి వార్షిక పరీక్షలో
# వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- విద్యార్థులు కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకోవడమే తల్లిదండ్రులకు ఇచ్చే అతి పెద్ద బహుమతి
- భయం, ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలకు హాజరు కావాలి
- విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం మెనూ ప్రకారం అందించాలి




2 లో..

# అర్ధరాత్రి ఆపదొస్తే.. ఖమ్మం పరుగు తీయాల్సిన అవస్థలు ఇక ఉండవు!




**జిల్లా ఆసుపత్రిని మరిపించేలా వసతులు**

గతంలో కేవలం 30 పడకలతో, అరకొర వసతులతో ఉన్న ఈ ఆసుపత్రి వల్ల ప్రజలు పడ్డ ఇబ్బందులను మంత్రి గుర్తు చేసుకున్నారు. "నాడు ప్రసవం కావాలన్నా, అత్యవసర చికిత్స కావాలన్నా ఖమ్మం ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లడం తప్ప మరో మార్గం ఉండేది కాదు. కానీ ఇప్పుడు మన ప్రజా ప్రభుత్వం వచ్చాక, జిల్లా హెడ్ క్వార్టర్ ఆసుపత్రిని మరిపించేలా ఇక్కడ అన్ని వసతులు కల్పిస్తున్నాం. డయాలసిస్ యూనిట్లు, అత్యాధునిక పరికరాలతో కూడిన వైద్యాన్ని రాబోయే కొద్ది నెలల్లోనే ఇక్కడ అందుబాటులోకి తెస్తాం" అని భరోసా ఇచ్చారు.

**వైద్యులు దేవుళ్లతో సమానం.. ఇక్కడే ఉండాలి!**

వైద్య సిబ్బంది పనితీరుపై మంత్రి దిశానిర్దేశం చేశారు. "ప్రభుత్వం వందల కోట్లు ఖర్చు పెట్టి భవనాలు కట్టవచ్చు.. కానీ డాక్టర్ అందుబాటులో ఉంటారనే నమ్మకం రోగికి కలిగినప్పుడే ఆ ఆసుపత్రికి సార్థకత ఉంటుంది. డాక్టర్లు, సిబ్బంది ఎక్కడో ఉండటం కాదు.. ఈ హెడ్ క్వార్టర్స్‌లోనే నివసించాలి. చర్ల, మణుగూరు, ఇల్లందు ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రులు అద్భుత ఫలితాలు ఇస్తున్నాయి. ఇక్కడ కూడా అదే అంకితభావం కావాలి. విధుల్లో చిత్తశుద్ధి చూపే సిబ్బందికి నా నియోజకవర్గం తరపున ప్రత్యేక బహుమతులు అందజేస్తాను" అని ప్రకటించారు.

**విద్య, వైద్యమే మా ప్రభుత్వ అజెండా**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదవాడికి నాణ్యమైన చదువు, వైద్యం అందించడమే పరమావధిగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. "కేవలం వైద్యమే కాదు.. రాబోయే రోజుల్లో విద్యారంగంలోనూ విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయి. గడిచిన రెండేళ్ల మూడు నెలల కాలంలోనే మౌలిక వసతుల కల్పనలో మనం ఎంతో పురోగతి సాధించాం. ఈ ప్రభుత్వం ఎవరినీ నొప్పించదు.. కానీ ఉద్యోగులు బాధ్యతగా పనిచేసి ప్రజలకు ఫలితాలు అందించాలి" అని స్పష్టం చేశారు.

**కాంట్రాక్టర్ కి ఆదేశాలు...**

"మార్చిలో పనులు మొదలవుతున్నాయి.. యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, మళ్లీ డిసెంబర్ నాటికే ఈ ఆసుపత్రిని ప్రారంభించాలి" అని గడువు విధించారు. అనంతరం మంత్రి పొంగులేటి లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆరోగ్య శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు , మండల నాయకులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# పదవ తరగతి వార్షిక పరీక్షలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి





ఖమ్మం, మార్చి సూర్య (మేజర్ న్యూస్) విద్యార్థులు ఏలాంటి భయం, ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పదవ తరగతి వార్షిక పరీక్షలకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. గురువారం ఖమ్మం రూరల్ మండలం కోదాడ క్రాస్ రోడ్ వద్ద గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులం (బాలికల) ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా తరగతి గదులు, పరిసరాలను తిరుగుతూ, మౌళిక సదుపాయాలు, వంటగది పరిశుభ్రత, ఆహార నాణ్యత, నిల్వ విధానాలు, స్టోర్ రూమ్‌లో ఉన్న బియ్యం, పప్పులు, కూరగాయలు, కోడిగుడ్లులు, ఇతర సరుకుల సామగ్రిని తనిఖీ చేసి రికార్డు లెక్కలను క్షుణంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న కామన్ మెనూ ప్రకారం వండుతున్న ఆహారం అన్నం, కూరలను పరిశీలించారు.విద్యార్థులతో నేరుగా ముచ్చటించి పాఠశాలలో కల్పిస్తున్న వసతుల గురించి, మెస్ కమిటీ వ్యవహారాలపై వివరాలు అడిగి తెలుసుకుని, కమిటీ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మెనూకు అనుగుణంగా నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కలెక్టర్ పదవ తరగతి గది సందర్శించి, విద్యార్థులతో ముచ్చటించారు. ఏలాంటి భయం, ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలకు సిద్దం కావాలని హితబోద చేస్తూ, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ విద్యార్థులు చదువు పై దృష్టి పెట్టి పరీక్షలకు హాజరు కావాలని, పరీక్షలకు మరో 9 రోజులు ఉందని, ఉన్న సమయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మనం ఎంత సమయం చదువుతున్నాం అనే దానికంటే ఎంత శ్రద్ధగా చదువుతున్నా మనేది చాలా ముఖ్యమని తెలిపారు. ఉపాధ్యాయుల సహకారం తీసుకుంటూ పరీక్షలకు బాగా సన్నద్ధం కావాలని, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని కలెక్టర్ సూచించారు.

పదవ తరగతి మెయిన్ పరీక్షల కంటే ముందు వీలైనంత మేర అధిక సంఖ్యలో ప్రీ ఫైనల్ పరీక్షలు రాయాలని తెలిపారు. పరీక్షలు అధికంగా రాయడం వల్ల తుది పరీక్షలను ఎటువంటి ఒత్తిడి లేకుండా సులభంగా రాయగలుగుతామని అన్నారు. మనం చదివిన దానికంటే రాసిన అంశాలు అధికంగా గుర్తుండిపోతాయని కలెక్టర్ తెలిపారు. ఒత్తిడి ని అధికమిచ్చేందుకు కొంత సమయం శ్వాస సంబంధిత వ్యాయామాలు, యోగా లాంటివి విద్యార్థులు క్రమం తప్పకుండా చేయాలని సూచించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు నిద్రలేకుండా ఎట్టి పరిస్థితుల్లో ఉండవద్దని, ప్రతి రోజు కనీసం 7 నుంచి 8 గంటల పాటు మంచి నిద్ర ఉండాలని తెలిపారు. బయట ఆహారం తీసుకోవద్దని, బయట ఎక్కువ తిరగవద్దని, మంచినీరు తగినంత త్రాగాలని, ఆర్యోగంగా ఉంటే చదువు మీద దృష్టి పెడుతామని కలెక్టర్ సూచించారు. మనం చదువు పై నమ్మకంగా ఉంటూ పరీక్షలకు హాజరైతే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. నెల రోజుల పాటు పదవ తరగతి పరీక్షలు ఉంటాయని, విద్యార్థులు ఏకాగ్రతతో సిద్దమైతే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిసీవో జ్యోతి, ప్రిన్సిపాల్ కె. శ్రీ లత, వైస్ ప్రిన్సిపాల్ డి. సంధ్యారాణి, ఉపాధ్యాయులు సిహెచ్. ఏల్లిశ్వరి, జి. సంధ్యారాణి, కె. విజయలక్ష్మి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వనం నుండి జనంలోకి పగిడిద్దరాజు





గుండాల, సూర్య (మేజర్ న్యూస్)–ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరైన మేడారం సమ్మక్క భర్త పగిడిద్ద రాజు జాతర మండలపరిధిలోని యాపలగడ్డలో అర్రెమ్ వంశీయులు ప్రతి సంవత్సరం ఘనంగా మూడు రోజులపాటు నిర్వహిస్తుంటారు. రెండవ రోజు గురువారం వనదేవతను వనం నుండి జనంలోకి ఆదివాసి సంప్రదాయాల నడుమ అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా తీసుకువచ్చి సమ్మక్క పగిడిద్దరాజు ఎదురిల్లు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం యాపలగడ్డ సమీపంలోని గద్దెలపై ప్రతిష్టించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించుటకై ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలతో పాటు ఇతర జిల్లాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వనదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అర్రెమ్ వంశీయులు, నిర్వాహకులు ఆదివాసి సాంప్రదాయాల నడుమ జోగుకు వెళ్ళుట, వనదేవతలను గంగా స్నానం చేయించుట కార్యక్రమాలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మేడారం ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఇర్పా సునీల్, సుకన్య, మాజీ చైర్మన్ లచ్చు పటేల్ వనదేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గుండాల సీఐ తిరుపతి, ఎస్సై సైదా రాహుఫ్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లా స్థాయిలో వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్రెమ్ వంశీయులు, జాతర నిర్వాహకులు, వడ్డెలు, తలపతులు తదితరులు పాల్గొన్నారు.

# వడ్డీకి వడ్డీలతో..వేధిస్తున్నారు

అవసరాల కోసం తీసుకున్న చిన్న మొత్తాల అప్పులు కాలక్రమేణా లక్షల్లోకి చేరి తమ జీవితాలను నరకంగా మారుస్తున్నాయని బాధితులు కన్నీటి పర్యంతమవుతున్నారు.ఒకొక్కరి బాధ ఒక్కోలా ఉందని, అత్యవసర సమయంలో అప్పు తీసుకున్నామని కానీ ఇప్పుడు కట్టుబానిసలుగా మారిపోయామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రూ.20వేలు అప్పు తీసుకున్నవారు చివరకు లక్ష రూపాయల వరకు చెల్లించాల్సి వస్తోందని, రూ.50 వేలు తీసుకున్న వారు రెండు లక్షల రూపాయల వరకు మిత్తి చెల్లించాల్సి వస్తోందని చెబుతున్నారు. అక్షరాలా రూ 20ల వడ్డీ పేరుతో ప్రారంభమైన ఈ అప్పులు తరువాత వడ్డీకి వడ్డీ, చక్రవడ్డీ, బారు వడ్డీ రూపంలో పెరిగిపోతూ అసలుకంటే కొసరే ఎక్కువగా చెల్లించాల్సిన పరిస్థితి వస్తోందని ఆవేదన చెందుతున్నారు.అమాయక పేదల అవసరాలను ఆసరాగా చేసుకుని ఈ వడ్డీవ్యాపారాన్ని కొనసాగిస్తున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఒక గంట ఆలస్యమైనా ఇంటి వద్దకు వచ్చి పరువు తీస్తూ మాట్లాడుతున్నారని, ఇంటికి వచ్చే వారికీ, చుట్టుపక్కల వారికి అప్పు విషయాన్ని చెప్పి అవమాన పరుస్తున్నారని బాధితులు వాపోతున్నారు.దీంతో సమాజంలో తమ గౌరవం దెబ్బతింటోందని వారు అంటున్నారు. దీంతో భయభ్రాంతులకు గురై ఇప్పటివరకు తమ సమస్యలను బయట పెట్టలేకపోయామని వారు చెబుతున్నారు.ఇంట్లో భార్యాభర్తల మధ్య గొడవలు పెరిగిపోయాయని కుటుంబంలో మనశ్శాంతి లేకుండా పోయిందని.. నిద్రపోయి ఎన్నో రోజులు అయిందని..మాకు ఇక ఆత్మహత్యే శరణ్యం అనిపిస్తోందని కన్నీటి పర్యంతమౌతున్నారు.ఈ దందాపై అధికారులు వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు. అమాయక పేదల అవసరాలను ఆసరాగా చేసుకుని నడుస్తున్న ఈ వడ్డీ వ్యాపారంపై దర్యాప్తు జరిపి బాధితులకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.ఈ విషయమై ఏడూళ్ల బయ్యారం సిఐ వెంకటేశ్వరరావును వివరణ కోరగా మాకు ఇప్పటివరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఫిర్యాదు చేస్తే చర్యలు చేపడతామని తెలిపారు.

# వేసవిలో త్రాగునీరు సరఫరా చేయాలి

## ఎంపీడీఓ కార్యాలయం ముందు సీపిఎం ధర్నా






ఇల్లందు ఆర్ సి,సూర్య (మేజర్ న్యూస్) - వేసవి కాలం ప్రారంభమైన దృశ్య పేదల నివసించే ప్రాంతంలో మంచినీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎంపీడీవోకు సమర్పించిన వినతి పత్రంలో ఈ విధంగా వారు పేర్కొన్నారు. సిఎస్పీ బస్తీ గ్రామపంచాయతీ పరిధిలోని దేవులపల్లి యాకయ్య నగర్ లో గత ఏడేళ్లుగా ఇల్లు లేని పేదలు ప్రభుత్వం భూమి లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారు. కానీ ప్రభుత్వం మాత్రం వారికి త్రాగునీరు,మౌలిక సదుపాయాలు కల్పించడం లేదు. తమ న్యాయమైన డిమాండ్ ల పరిష్కారం కోసం సీపిఎం పార్టీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న 90రోజుల ప్రణాళిక అమలు కొరకు మండల అధికారులు,సర్పంచుల సమావేశం ఏర్పాటు చేసిన సంగతి తెలుసుకొని దేవుల పల్లి యాకయ్య నగర్ గ్రామ గుడిసె వాసులు పెద్ద ఎత్తున ఎం డీ ఓ ఆఫీసుకు సీపీఎం ఆధ్వర్యంలో చేరుకొని ధర్నా చేశారు.అనంతరం మండల అభివృద్ధి అధికారి దన్సింగ్ కి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఎండీఓ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక డ్రైవ్ లో త్రాగునీటి సమస్య పరిష్కరిస్తానని ఎండీఓ హామీ ఇచ్చారు.అనంతరం మన్యం మోహన్ రావు అధ్యక్షతన జరిగిన సభలో అబ్దుల్ నబి సీపీఎం మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ కుమార్ లు పాల్గొని మాట్లాడుతూ గత ఏడేళ్లు గా పేదలు గుడిసెలు వేసుకుని నివాస్తున్నా ప్రభుత్వం వారికి మౌళిక సదుపాయాలు కల్పించలేదని అని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమను గుర్తించి త్రాగునీరు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, సంతోష, వెంకన్న, వైకుంఠం, హుస్సేన్, రాజు ,కౌసల్య, హేమలి, సరిత, కోటమ్మ, మంగ, నీలారాణి, పద్మ, హబీబున్నిస, రేష్మ తదితరులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో నిర్లక్ష్యం సహించేది లేదు



మణుగూరు ఆర్ సి,సూర్య (మేజర్ న్యూస్)-విధి నిర్వహణలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని జిల్లా కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. గురువారం మణుగూరు మండలంలో పలు ప్రభుత్వ సంస్థల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో భాగంగా మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,ఆశ్రమ గిరిజన ఉన్నత పాఠశాల, గుండు సింగారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం, ప్రభుత్వ గిరిజన మోడల్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి అక్కడి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు.మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్ ఆసుపత్రిలోని వార్డులు, ఔషధ నిల్వ గది, మందుల సరఫరా విధానం, ఔట్‌పేషంట్ విభాగం, సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించారు.ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగుల పట్ల సేవాభావంతో వైద్య సేవలు అందించాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రిలో 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రి ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.అనంతరం కలెక్టర్ మణుగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు ఆశ్రమ గిరిజన ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, కిచెన్ షెడ్, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, బోధన విధానం గురించి తెలుసుకున్నారు. కిచెన్ షెడ్‌లో ఆహార తయారీ విధానాన్ని పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అనే విషయాన్ని ఆరా తీశారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన బియ్యం, పప్పులు మరియు ఇతర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ పరీక్షలకు ఎలా సిద్ధమవుతున్నారో అడిగి తెలుసుకున్నారు.గత సంవత్సరం ఫలితాల వివరాలు తెలుసుకొని ఈ ఏడాది 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యతతో పాటు పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని, వారికి నాణ్యమైన ఆహారం అందించడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో ఎటువంటి లోటుపాట్లు తలెత్తినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గిరి యూనిట్ ద్వారా సరఫరా అవుతున్న చిక్కీలను స్వయంగా రుచి చూసి వాటి నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే విద్యార్థులకు సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనాన్ని కూడా రుచి చూసి ఆహార నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఆశ్రమ గిరిజన ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాలను కూడా కలెక్టర్ తనిఖీ చేశారు. అక్కడి తరగతి గదులు, విద్యార్థుల హాజరు, బోధన విధానం మరియు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. చిన్నారులతో మాట్లాడి వారికి పాఠాలు ఎలా బోధిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే మంచి విద్య అందేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.గుండు సింగారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం మరియు ప్రభుత్వ గిరిజన మోడల్ ప్రాథమిక పాఠశాలను కూడా కలెక్టర్ పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న సౌకర్యాలు, పోషకాహారం పంపిణీ విధానం, పిల్లల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలోని వంటగది, స్టోర్ రూమ్, త్రాగునీటి సదుపాయం, పరిశుభ్రత పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన బియ్యం, పప్పులు, గుడ్లు మరియు ఇతర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేసి గుడ్ల పరిమాణాన్ని పరిశీలించారు. పిల్లలకు అందించే పోషకాహారం మెనూ ప్రకారం సమయానికి అందుతున్నదా అనే విషయాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న ప్రీ-స్కూల్ విద్యా కార్యక్రమాలు, ఆటపాటల ద్వారా బోధన విధానాన్ని కూడా పరిశీలించారు. పిల్లలకు పోషకాహారం నాణ్యంగా, పరిశుభ్రంగా అందేలా, కేంద్రం పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనినా, ప్రధానోపాధ్యాయురాలు మహాలక్ష్మి, వైద్యులు, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, ఉపాధ్యాయులు విద్యార్థులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలి

### - సంఘ సంస్కర్త డాక్టర్ సతీష్ ఖండేల్వాల్



ఇల్లందుఆర్‌సి, సూర్య (మేజర్ న్యూస్)- అధికార అనధికార స్వచ్ఛంద సేవా సంస్థ ప్రముఖులకు ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కలిగించాలని తెలంగాణ ప్రభుత్వ జంతు సంక్షేమ బోర్డు మాజీ సభ్యుడు డాక్టర్ సతీష్ ఖండేల్వాల్ డిమాండ్ చేశారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధిలో సోషల్ వర్కర్ల పాత్ర కీలకమని, కానీ సామాజికంగా వారికి దక్కాల్సిన గుర్తింపు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ ప్రాంతాలే కాక ప్రాంతాలలో ఏమీ ఆశించకుండా సేవే ధర్మంగా సేవ చేస్తున్న స్వచ్ఛంద సేవా కార్య కర్తలు సామాజికవేత్తలు సంఘసంస్కర్తలు పర్యావరణ వేత్తలు, విద్యావేత్తలు, పాత్రికేయులు, జర్నలిస్టులు, న్యూస్ రైటర్స్, క్రీడాకారులు, కవులు, రచయితలు, చిత్రకారులు, కళాకారులు స్వచ్ఛభారత్ బ్రాండ్ అంబాసిడర్లను అన్ని ప్రభుత్వ రంగాలలో సేవ భావన కలిగిన వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వాలని కోరారు.

## 99 రోజుల కార్యాచరణపై కౌన్సిలర్ల సమావేశం



అశ్వారావుపేట టౌన్, సూర్య (మేజర్ న్యూస్)-తెలంగాణ ప్రభుత్వం ప్రజాపాలనా ప్రగతి ప్రణాళికలో భాగంగా మున్సిపాలిటీల్లో చేపట్టిన 99రోజుల కార్యాచరణపై గురువారం చైర్మన్ జూపల్లి శశికల అధ్యక్షతన కౌన్సిలర్ల ప్రత్యేక సమావేశం జరిగింది.సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బి.నాగరాజు మాట్లాడుతూ, మార్చి 6 నుంచి 15 వరకు 10 రోజుల పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఇంటింటికీ తడి, పొడి చెత్తా సేకరణ, మురికి కాలువల పూడీ తీత, ఇతర కార్యక్రమాలకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేస్తామని చెప్పారు. ప్రజలను అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేసి చైతన్యం పెంపొందించాలని కౌన్సిలర్లకు సూచించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, సహా కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ సహకారంతో విద్యార్థులకు ప్యాడ్స్, పెన్స్ అందజేత

అశ్వరావుపేట టౌన్, సూర్య (మేజర్ న్యూస్)-లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీహెచ్‌ఎస్ స్కూల్‌లో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు కోటగిరి సీతారామస్వామి సహకారంతో గురువారం ప్యాడ్స్, పెన్స్‌లు అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణగా చదువుకొని ఉన్నత స్థాయిలో ఎదగాలని, పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పేరు తెచ్చేలా చేయాలని కోరారు.పాఠశాలకు ఏ సహాయం కావాలన్నా లయన్స్‌క్లబ్ ఎల్లప్పుడూ సహకరిస్తుందని తెలిపారు.కార్యక్రమానికి లయన్స్ క్లబ్ అధ్యక్షులు లక్కినేని నరేంద్రబాబు అధ్యక్షత వహించారు. సీనియర్ కోటగిరి సీతారామస్వామి, జల్లిపల్లి కొండ, పెద్దమల్ల పుల్లారావు, చీమకుర్తి చక్రధరం, కంచర్ల రామారావు, జూపల్లి బ్రహ్మారావు, కోటగిరి మోహన్ రావు, బలమూరి సూర్య రావు, పాఠశాల ప్రధాన అధ్యాపకురాలు, అధ్యాపకులు పాల్గొన్నారు.



# కార్పొరేషన్‌లో చెత్త ఎత్తడం ఎలా..?

-ఇంజన్లు తెచ్చారు.. ట్రక్కులు మరిచారు ...
-నత్త నడకన పురపాలన....
-రూ 3 కోట్ల కార్పొరేషన్ నిధులేమయ్యాయి..?
-ఏది నూతన పాలక వర్గానికి దిశా నిర్దేశం..?
-తుప్పుపట్టి పోయిన పురపాలక వాహనాలు
-నిర్లిప్తంగా పురపాలక అధికారులు
-అగమ్య గోచరంగా పారిశధ్య సిబ్బంది






కొత్తగూడెం అర్బన్, సూర్య (మేజర్ న్యూస్)- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లో పాల్వంచ కొత్తగూడెం జంట పట్టణాలను కలుపుతూ నూతనంగా ఏర్పాటు చేయబడిన కొత్తగూడెం పురపాలక కార్పొరేషన్ కి బాలరిష్టాలు తప్పడం లేదు. సుమారు 2లక్షల మంది ప్రజల ఆకాంక్షలు కనుగుణంగా స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చొరవతో ఏర్పడినటువంటి కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయడం లేదని ప్రజలందరూ వాపోతున్నారు....వివరాల్లోకి వెళితే... తెలంగాణ ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి చెత్త సేకరించడం కోసం ట్రాక్టర్లు కొనుగోలు చేసింది. కొత్తగూడెం పాల్వంచ పురపాలక సంఘంలో గత కొన్ని సంవత్సరాలుగా పురపాలక అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్న తీరు విస్మయానికి గురిచేస్తుంది. ప్రజల సౌకర్యం కోసం ప్రజాధనాన్ని వెచ్చించి చెత్త సేకరించడానికి



కొన్న చెత్త సేకరణ వాహనాలను సరైన అజమాయిషి లేక తుప్పు పట్టి వినియోగించలేని విధంగా మెకానిక్ షెడ్లు కు పరిమితమైన విషయం విష్మయానికి గురిచేస్తుంది. ఎన్నో వాహనాలు నిరుపయోగంగా మారి చెత్త సేకరణకు లేకపోవడం వలన నగరం మొత్తం దుర్గంధమయంగా ఉన్నది.కొత్తగూడెం కార్పొరేషన్ గా ఏర్పడిన తర్వాత నగరాభివృద్ధికి సుమారు రూ 3 కోట్ల నిధులు కేటాయించ బడినవని సమాచారం.పాల్వంచ పట్టణానికి పాలకమండలి లేక సుమారు 25సంవత్సరాలు, కొత్తగూడెంలో పాలకమండలి లేక సంవత్సరకాలం. ఈ రెండు పట్టణాల పురపాలక సంఘాలకు ఒకరే కమిషనర్ కావడం గమనార్హం. పాలకమండలి లేనందున కమిషనరే బాధ్యులు. గత పాలకమండలి పదవి కాలం పూర్తయిన తర్వాత అదనపు జిల్లా కలెక్టర్ ను ఇన్చార్జిగా నియమించడం జరిగింది. కమిషనర్ పూర్తి బాధ్యులుగా ఉండి కూడా చెత్త సేకరణ వాహనాలపై దృష్టి సారించలేదు. నూతనంగా ఏర్పడిన కార్పొరేషన్ ను 60 డివిజన్లు గా విభజించారు. డివిజన్ కి ఒకటి చొప్పున కనీసం 60 ట్రాక్టర్లు అవసరం ఉంది. అయినా ఇదేమి పట్టనట్టుగా కమిషనర్ వ్యవహరించడం కొత్తగూడెం నగర ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. రిపేరు కావాల్సిన వాహనాలు మెకానిక్ షెడ్డులకి లకి పరిమితం అయ్యాయి. నెలలు గడుస్తున్న వాటిని పట్టించుకునే నాథుడు లేడు. వాహనాలు లేనప్పుడు చెత్త సేకరించడం ఎలా అని పారిశుద్ధ్య సిబ్బంది వాపోతున్నారు. కొత్తగూడెం పట్టణంలో రెండు ట్రాక్టర్లు వినియోగంలో ఉన్నవి. గతంలో కొత్తగూడెంలో ట్రాక్టర్ కిరాయికి తెచ్చి వినియోగించేవారు. గత కొన్ని ఏళ్లుగా అది కూడా లేదు. పాల్వంచలో 8 ట్రాక్టర్ వినియోగంలో ఉండేవి,కేవలం ఇప్పుడు మూడు మాత్రమే వినియోగంలో ఉన్నవి

**-కొత్త ట్రాక్టర్లు కొన్నారు ...ట్రక్కులు మరిచారు**

కొత్తగూడెంలో కొద్ది నెలల క్రితం కమిషనర్ ఐదు కొత్త ట్రాక్టర్లు కొనుగోలు చేశారు కానీ ట్రక్కులు కొనడం మర్చిపోయారు. అందువల్ల వినియోగించలేని దుస్థితి కలిగింది.ఫిబ్రవరి 11 జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో నూతన పాలకవర్గం ఎన్నిక కాబడింది. కొత్త కార్పొరేటర్లకు దిశా నిర్దేశం చేసి పాలనపగ్గాలు చేపట్టవలసి ఉండగా ఇంతవరకు 20 రోజులు గడిచిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకో లేదని ప్రజలందరూ వాపోతున్నారు.

**-పన్నులు వసూలు చేసే ఉత్సాహం పారిశుద్ధ్యం మీద లేదా**

ఇంటి పన్నులు వసూలు చేసే ఉత్సాహం పట్టణ పారిశుద్ధ్యం మీద కూడా చూపాలని ప్రజలందరూ కోరుతున్నారు.నూతన పాలకవర్గం పెను సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంది. కార్పొరేషన్ సమగ్ర అభివృద్ధికి పారిశుద్ధ్య పనికి కావలసిన సిబ్బందిని నియమించుకోవాల్సింది. ప్రభుత్వం పర్మినెంట్ ఉద్యోగాలు ఇచ్చేది లేనందున దినసరి వేతనాలపై సిబ్బంది నియమించుకోవాలి. చెత్త సేకరణ వాహనాలు లేనందున కిరాయి వాహనములు తో చెత్త సేకరించ వలసి ఉన్నది. కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటులో భాగంగా సుజాతనగర్ మండలంలోని ఏడు గ్రామ పంచాయతీలోని విలీనం చేశారు. ఏడు గ్రామ పంచాయతీలు కనీసం ఏడు ట్రాక్టర్లు ఉండగా వాటిని రిపేర్ చేసి వినియోగంలోకి తేవలసి ఉన్నది.వీటన్నిటికీ కౌన్సిల్లో అప్రూవ్ చేయించు కోవలసిన బాధ్యత నూతన కార్పొరేటర్ల మీద ఉన్నది.ఇవన్నీ జరిగేది ఎప్పుడు నగర పారిశుద్ధ్యం బాగుపడేది ఎప్పుడు అని ప్రజలందరూ గుసగుసలాడుతున్నారు. ప్రస్తుతం కొత్తగూడెం కార్పొరేషన్ కమిషనర్ కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్ పరిసర ప్రాంత డివిజన్లో పై దృష్టి సారించి రిపేర్ లో ఉన్న వాహనాలకి నిధులు కేటాయింపు జరిపి వెంటనే రిపేర్ లో ఉన్న వాహనాలను రిపేర్లు పూర్తి చేయించి అవసరమైనన్ని మినీ వ్యాన్లు కొనుగోలు చేసి చెత్త సేకరించి స్వచ్ఛ కొత్తగూడెం గా తీర్చి దిద్ది ప్రజా ఆరోగ్య పరిరక్షణకు ఉపక్రమించ వలసిందిగా కొత్తగూడెం ప్రజానీకం కోరుకుంటున్నారు.కార్పొరేషన్ సానిటరీ ఇన్స్పెక్టర్లు జవాన్లు ముఖద్దములు పరిశుద్ధ సిబ్బంది వంటి గొప్ప నెట్వర్క్ కలిగిన వ్యవస్థ నిర్వీర్యం కాకుండా పురపాలక యంత్రాంగాన్ని పూర్తిగా వినియోగించుకొ వలసిన బాధ్యత కమిషనర్ మీద ఉన్నది. ఇప్పటికైనా కమిషనర్ నగర పాలనపై దృష్టి సారించి నూతన పాలకవర్గం సహకారంతో కొత్తగూడెం కార్పొరేషన్ నుఅభివృద్ధి పథంలోకి నడిపించాలని ప్రజలందరూ అభిలాషిస్తున్నారు.

## రామిశెట్టి రాంబాబు ఇంట వివాహ వేడుకలో పాల్గొన్న మాజీ ఎంపీటీసీ సతీష్ కుమార్



జూలూరుపాడు,సూర్య(మేజర్ న్యూస్)- మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రామిశెట్టి రాంబాబు, శ్రీదేవి కుమారుని వివాహ వేడుకలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కాకర్ల మాజీ ఎంపీటీసీ పొన్నెకంటి సతీష్ కుమార్ పాల్గొన్నారు.వివాహ వేడుకలో పాల్గొని నూతన దంపతులు శ్రీకర్ భవతిలను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో జూలూరుపాడు మండలం యువజన కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు జిడుగు రాఘవ, కాంగ్రెస్ పార్టీ నాయకులు చేరుకుమల్లి నవీన్ కుమార్, సోబ్బని లాలయ్య, కంచిపోగు రాజేశేఖర్, ఉదారి రాము తదితరులు పాల్గొన్నారు.

## గద్దెనెక్కిన దూలుగొండ తల్లి



గుండాల, సూర్య (మేజర్ న్యూస్)-ఈసం వంశీయుల ఆరాధ్యదైవమైన దూలుగొండ తల్లి వనం నుండి ఆదివాసీ సాంప్రదాయాలతో ధోళీల చప్పుల్ల నడుమ గురువారం గద్దెలపై ప్రతిష్టించారు. ప్రతీ సంవత్సరం హోలీ పున్నమి అనంతరం వచ్చే బుధ, గురు, శుక్రవారాలలో ఈసం వంశీయులు గుండాల మండల పరిధిలోని రోల్లగడ్డ గ్రామంలో దూలుగొండ జాతరను నిర్వహిస్తుంటారు. అందులో భాగంగానే గురువారం సమీపం లోనిఊరగుట్ట నుండి దేవతను ఆదివాసీ సాంప్రదాయాలతో గద్దెలపై ప్రతిష్టించారు. శు క్రవారం భక్తులు మొక్కులు చెల్లించుకున్న అనంతరం సాయంత్రం వన ప్రవేశం ద్వారా జాతర తంతు ముగుస్తుందని నిర్వాహకులు ఈసం పాపారావు, రామ్మూర్తి, వెంకట్రామయ్య, క్రిష్ణ, సమ్మయ్య, పగడయ్య, కన్నయ్య, లక్ష్మయ్య, రామయ్య, బిక్షం తెలిపారు.

## 46వ డివిజన్ అభివృద్ధికై సహకరించాలి

**- కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి**



పాల్వంచ,సూర్య (మేజర్ న్యూస్)- కార్పొరేషన్ పరిధిలోని 46వ డివిజన్ అభివృద్ధికై సహకరించాలని కార్పొరేషన్ అధికారులు సహకరించాలని కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి కోరారు.గురువారం జరిగిన మొదటి కొత్తగూడెం కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిల్ సభ్యులలో ఆమె మాట్లాడుతూ తన డివిజన్ పర్యటనలలో ప్రజల ద్వారా సేకరించిన సమస్యలను కౌన్సిల్ మరియు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.పాత పాల్వంచ మెయిన్ రోడ్ లోగల బస్ స్టాండ్, వాటర్ ట్యాంక్ మెయింటెనెన్స్ లేక చెత్త పేరుకుపోయాయని, వాటిని శుభ్రపరిచి, ఆధునీకరించాలని కోరారు. పాత పాల్వంచలో వాటర్ సప్లై లేని గృహాలకు తక్షణమే నీటి సరఫరాకై ఏర్పాట్లు చేయాలనీ కోరారు. పాత పాల్వంచలోని ముర్రేడు వాగు వద్ద స్మశాన వాటిక, రజక బజార్ స్మశాన వాటికలను తక్షణమే శుభ్రపరిచి, ప్రహరీ గోడ కట్టాలని, బోరింగ్ పంప్ ఏర్పాటు చేయాలని కోరారు.పాత పాల్వంచలో పారిశుధ్యం కొరకు తక్షమే స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం కార్పొరేషన్ అధికారులు,కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

# త్రివేణిలో ఘనంగా వీడ్కోలు వేడుకలు

**ఖమ్మం సూర్య ఎడ్యుకేషన్ న్యూస్**





ఖమ్మం పట్టణంలోని స్థానిక త్రివేణి పాఠశాల యాజమాన్యం వారు పదవ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు స్థానిక హరిత గార్డెన్స్ నందు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా న్యూరో సైకియాట్రిస్ట్ శ్రీ దివ్య రెడ్డి పాల్గొని పిల్లలకు పరీక్షలకు సంబంధించి పలు సూచనలు తెలియజేశారు. పరీక్షలలో భయం లేకుండా ధైర్యంగా రాయడం కోసం పలు సూచనలు చేశారు.సోషల్ మీడియా కి దూరంగా ఉండాలని, గమ్యం చేరుకోవడం కోసం గట్టిగా ప్రయత్నించాలని పిలుపు నిచ్చారు... త్రివేణి డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి తన సందేశం లో గత 22 సంవత్సరాలుగా త్రివేణి ఖమ్మం పదవ తరగతిలో అనేక రాష్ట్రస్థాయి ర్యాంకులను అందించిందని ఇది అంతా కూడా మా త్రివేణి కరికులం మూలాన మాత్రమే సాధ్యపడిందని తెలియజేశారు. ఈ ర్యాంకుల సాధనలో నిష్ణాతులైన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయుల సహకా రం, మా ప్రణాళిక కలిసి అద్భుతమైన విజయాలను అందుకున్నాము. భవిష్యత్తులో కూడా అంతకుమించి మంచి ర్యాంకులు తేవాలని పిల్లలకు సందేశం పంపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ త్రివేణి విద్యార్థులు అంటేనే ర్యాంకర్లనీ, సుగుణాల బ్యాంకర్లని,10వ తరగతి ఫలితాలలో మాకు మేమే పోటీ అని తెలియజేశారు.పదవ తరగతి విద్యార్థులు మాట్లాడుతూ వారి యొక్క అనుభూతులని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ముస్తఫా, స్వప్న ,నయీమ్, పదవ తరగతి ఇంచార్జ్ శ్రీధర్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు










# గంజాయి కేసులో నిందుతులకు 20 ఏండ్ల జైలు శిక్ష...2 లక్షల జరిమానా

**ఖమ్మం (సూర్య బ్యూరో):**

గంజాయి కేసులో ముగ్గరు నిందుతులకు ఒక్కొక్కరికి 20 ఏండ్ల జైలు శిక్ష.....2లక్షల జరిమానా విధిస్తూ.. మొదటి అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కె. ఉమాదేవి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... 2021 ఏడాది ఏప్రిల్ 7 న రఘునాథపాలెం పోలీసులు ఆధ్వర్యంలో వెంకటాపాలెం గ్రామ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానస్పదంగా కనిపించిన కారు ను తనిఖీ చేయగా 30లక్షల విలువ గల 194 కేజీల గంజాయిని గుర్తించారు. నిందుతులకు అదుపులో తీసుకునే విచారించగా అక్రమార్జన కోసం ఢొంకరాయ నుండి హైదరాబాద్ గంజాయి సరఫరా చేస్తునట్లు విచారణ వెల్లడైంది.

**నిందుతులు** – A1 బోడ వాల 26 సం,, అననేయులుతండా, దండేగా (ఎ), పెద్దగూడూరు, మహబూబాద్ జిల్లా A2 కొండపల్లి రవితేజ 25 సం,,సారపాక బూర్గంపాడు మండలం. A3 బొజ్జ వంశీ 22 సం, బూర్గంపాడు మండలం, సారపక చెందిన నిందుతులపై రఘునాద పాలెం పోలీస్ స్టేషన్ లో NDPS, 1985 చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు సమగ్ర దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగపత్రం దాఖ లు చేశారు. నిందితుడిపై మోపిన అభియోగం రుజువు కావటంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.ప్రాసిక్యూషన్ కు సహకరి ంచిన అప్పటి విచారణ అధికారలు ఇన్స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి , అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ,జె. శరత్ కుమార్ రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ సాంబశివరావు, కోర్టు లైజనింగ్ కె.శ్రీకాంత్ (SI)) హోంగా ర్డ్ ఆఫీసర్ ఎండీ.ఆయూబ్ ను పోలీసు అధికారులు అభినందించారు.

# ఉత్సాహంగా పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు





**ఖమ్మం (సూర్య బ్యూరో):**

ప్రతి విద్యార్థి ఉత్తమ విద్యతో ఉన్నత శిఖరాలను అధిరో హించాలని అడిషనల్ డిసిపి ఏఆర్ కుమారస్వామి అన్నారు.శ్రీ కృష్ణ ప్రసాద్ మెమోరియల్ ఉన్నత పాఠశాల స్కూల్ చైర్ పర్సన్ శ్రీమతి నిషిత శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని ఆనందోత్సాహాల నడుమ ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగాస్కూల్ అడి షనల్ డిసిపి ఏఆర్ మాట్లాడుతూ.. విద్యార్థులు 10వ తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు నిర్దేశిత ప్రణాళికలను అనుసరించాలని అన్నారు. పది ఫలితాలు విద్యార్థి భవితను దిశానిర్దేశం చేస్తాయనీ, విద్యార్థి సమగ్ర అభివృద్ధికి సూచికగా నిలుస్తాయని అన్నారు. లక్ష్యం సాధించడానికి ఏకాగ్రత అవసరమనీ, ఇష్టపడి చదివి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యా తులు తీసుకురావాలన్నారు.SSC విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన క్రీడల్లో విజేతలకు బహుమతి అందజేశారు, పదో తరగతి పరీక్షకు వెళ్లే విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్, జామెంట్రీ బాక్స్ అందజేశారు .అనంతరం విద్యార్థిని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడం జరిగింది.



పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి సంస్కృతిక నృత్యాలను, జానపద కళా రూపాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. అడిషనల్ డీసీపీ ఏఆర్ పిల్లలకు స్వయంగా భోజనాలు వడ్డించారు.కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ నరసయ్య, ఆర్ ఐ కామరాజు, స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ రాజు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల డ్రైవర్లకు ఆరోగ్య పరీక్షలు

**సత్తుపల్లి మేజర్ సూర్య న్యూస్:**



ఖమ్మం జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకుగురువారం సత్తుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గల ప్రైవేట్ పాఠశాలల బస్సు డ్రైవర్లకు గురువారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో సత్తుపల్లి లయన్స్ క్లబ్, సత్తుపల్లి లయన్స్ క్లబ్ మేధ సహకారం తో జరిగిన వైద్య శిబిరంలో డ్రైవర్లకు కంటి పరీక్షలు, షుగరు, బీపీ పరీక్షలు నిర్వహించారు. సత్తుపల్లి సీ ఐ శ్రీహరి అద్వర్యం లో జరిగిన కార్యక్రమంలో ఎస్సై ప్రదీప్, లయన్స్ క్లబ్, ప్రైవేట్ విద్యాసంస్థల నివాహకులు నాయుడు వెంకటేశ్వర రావు, ప్రభాకరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రమేష్, గోగడ రవి కుమార్,మురళి, శ్రీనివాసరావు, రత్నాకర్ , కాకతీయ నర్సింగ్ కాలేజీ స్టూడెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థునులకు కళ్ళ జోడులు అందజేత

**పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్....**

కళ్ళచత్వారం ఉన్న ఇద్దరు పేద విద్యార్థునులకు కళ్ళజోడులను వితరణగా అందించారు. పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతుండగా శ్రీ రాజ సాయి మందిరం ట్రస్ట్ సభ్యులు రిటైర్డ్ సీఐ జెన్నారెడ్డి నరసింహారెడ్డి జడ్పీహెచ్ స్కూల్ వీఎం బంజర్ చదువుతున్న కావ్య, సౌజన్యలకు కళ్ళ అద్దాలను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు ఎస్ సత్యనారాయణ విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మార్చ్ 6 నుంచి 15 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహణ...

**-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**-మార్చి 12న జిల్లా స్థాయిలో సర్పంచ్, కౌన్సిలర్ లకు వర్క్ షాప్ నిర్వహణ,-ప్రతి కార్యాలయంలో పెండింగ్ ఫైల్స్ 10 రోజులలో క్లీయర్ చేయాలి**

**-మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ అమలు**

**-ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణపై జిల్లా అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం (సూర్య బ్యూరో):**

ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మార్చి 6 నుంచి 15 వరకు గ్రామ, పట్టణంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ అమలుపై గురువారం జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తుందని అన్నారు. మార్చి 6న ఉదయం 10 గంటలకు జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు, మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు.మార్చి 6 నుంచి మార్చి 15 వరకు పారిశుద్ధ్య నిర్వహణ, ఫైల్ క్లియరెన్స్ అంశాలపై ప్రాధాన్యత తో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గ్రామాలు, పట్టణాలలో మాత్రమే కాకుండా ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా పారిశుధ్య డ్రైవ్ చేపట్టాలని, పాత ఫర్నీచర్ తొలగించాలని, దీనిపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ ఉన్న ఫైల్స్ 10 రోజులలో క్లియర్ చేయాలన్నారు. పంచాయతీ, మున్సిపల్ శాఖ అధికారులు 10 రోజుల పాటు ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించాలని, ఉదయం డిఎల్ పిఓ, ఎంపిఓ, పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ కమీషనర్ ఫీల్డ్ లెవల్ లో తనిఖీలు నిర్వహిస్తూ ఎక్కడా రోడ్డుపై చెత్త లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. వార్డు సభ్యులు, సర్పంచ్, మున్సిపల్ చైర్ పర్సన్, మేయర్ వంటి ప్రజాప్రతినిధులను పూర్తి స్థాయిలో భాగస్వామ్యం చేయాలని అన్నారు. పబ్లిక్ ప్లేసెస్ లో పారిశుద్ధ్యశీ పట్ల అత్యంత ప్రాధాన్యత కల్పించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.మార్చి 12న జిల్లా స్థాయిలో సర్పంచ్, పట్టణాలలోని కౌన్సిలర్ లకు వర్క్ షాప్ నిర్వహిస్తున్నా మని, దీనికి ప్రతి ఒక్కరు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ ముగిసే నాటికి ఖమ్మం జిల్లాలో 10 వేల ఇందిరమ్మ ఇండ్లు గృహ ప్రవేశానికి సిద్ధం చేసేలా స్థానిక అసిస్టెంట్ ఇంజనీర్లు పని చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా ఇంచార్జి మంత్రి వర్యుల ఆధ్వర్య ంలో జరిగే సన్నాహక కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో ఎస్డీసి ఎం. రాజేశ్వరి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఏ. శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, జిల్లా విద్యా శాఖ అధికారిణి చైతన్య జైని, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. రామారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.





# జేఎన్టీయూహెచ్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో మెరిసిన ప్రియదర్శిని విద్యార్థినులు

**ఖమ్మం రూరల్ సూర్య మేజర్ న్యూస్ మార్చ్ 05 :**

జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ విడుదల చేసిన ద్వితీయ సంవత్సర పరీక్షా ఫలితాలలో, ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థినులు అద్భుత ప్రతిభ కనబరిచారు.సిఎస్సి విభాగానికి చెందిన తేనె మోహిత 9.25, కోడె అఖిల 8.95, టి అనక 8.4, యు నాగేశ్వరి 8.3 జీపీఏ సాధించి ఉత్తమ ప్రతిభను చాటారు.ఏఐడీ విభాగానికి చెందిన ఏ త్రివేణి, జై హన్సిక రెడ్డి 8.45, జీ చిన్మయి రెడ్డి 8.3 జీపీఏ సాధించారు.సిఎస్ఎం విభాగానికి చెందిన టి.అంకిత, వై.లక్ష్మీ ప్రసన్న 8.9, కే.ప్రసన్న 8.6 జీపీఏ సాధించారు.ఈసీఈ విభాగానికి చెందిన పి జోష్న 9.4, బి పూజ 8.65 జీపీఏ సాధించి కళాశాలకు గర్వకారణమయ్యారు.ఈ సందర్భంగా అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థినులను కళాశాల చైర్మన్ డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు అభినందించారు. విద్యార్థినుల క్రమశిక్షణ, అధ్యాపకుల నిబద్ధత, నాణ్యమైన బోధన ఫలితంగానే ఈ విజయాలు సాధ్యమయ్యాయని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.ప్రిన్సిపల్ డాక్టర్ బి గోపాల్ మాట్లాడుతూ విద్యార్థినుల అంకితభావం, క్రమశిక్షణతో కూడిన అధ్యయనం, అధ్యాపక బృందం నిరంతర మార్గనిర్దేశం వల్లే ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని, అకడమిక్ ఎక్సలెన్స్‌తో పాటు నైతిక విలువలు, పరిశ్రమకు సిద్ధమైన నైపుణ్యాలే మా లక్ష్యమని, ఈ ఫలితాలు ఆ దిశగా మా ప్రయాణాన్ని ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు. కళాశాల ఎకనామిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ మాట్లాడుతూ ఈ విజయం విద్యార్థినుల శ్రమకు ప్రతిఫలం మాత్రమే కాదు వారి భవిష్యత్ కెరీర్‌కు పునాది. మరింత పరిశోధన, ఇన్నోవేషన్ దిశగా ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాలకు చెందిన వివిధ విభాగాధిపతులు ఐ నరసింహారావు, ఎం వెంకటేశ్వరరావు, డి రమేష్, ఇతర అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం వద్దు

**- అంగన్వాడి కేంద్రాల పనితీరు బేష్**

**- అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన మున్సిపల్ చైర్మన్**

**కల్లూరు మార్చి 5 (సూర్య న్యూస్)**

మున్సిపాలిటీ పరిధిలో ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ శ్రీకారం చుట్టారు. గురువారం మున్సిపాలిటీ పరిధి. 3వ,4వ వార్డులలో కౌన్సిలర్లు దాసరి సుధారాణి, భూక్య రాంబాయి తో కలిసి పర్యటించారు. హౌసింగ్ కార్పొరేషన్ రిటైర్డ్ ఏ ఈ ప్రేమేశ్వరరావు చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లను శాలువాలతో సన్మానించారు. పర్యటనలో భాగంగా నూతన అంబులెన్స్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మూడు నాలుగు వార్డులలో సమస్యలను ప్రజల వద్ద నుండి నేరుగా తెలుసుకున్నారు. వార్డు పర్యటనలో భాగంగా సబ్ కలెక్టర్ ఆఫీస్ ఎదురుగా ఉన్న రెండు అంగన్వాడీ సెంటర్లను ఇంగ్లీష్ మీడియం పాఠశాలను సందర్శించారు. అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు విద్యాబోధన ఎలా జరుగుతుందని అంగన్వాడీ టీచర్లను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు, బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు ఇచ్చే పౌష్టిక ఆహారము మెనూ ప్రకారం సక్రమంగా అందుతుందా లేదా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అంగన్వాడి కేంద్ర పనితీరు బాగుందని అన్నారు. పిల్లలకు అందించే ఆహారాన్ని స్వయంగా పరిశీలించి చిన్నారులతో ముచ్చటి ంచారు. అనంతరం బాలింతలకు చిన్నారులకు ఇచ్చే కోడిగుడ్లను పరిశీలించి గుడ్ల పరిమాణం తక్కువగా ఉండటంతో సిడిపిఓ నిర్మలా జ్యోతి తో చరవాణిలో మాట్లాడి గుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టర్ తో మాట్లాడి అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేసే గుడ్ల పరిమాణం పెద్దగా ఉండే గుడ్లను ఆయా కేంద్రాలకు సరఫరా చేయించాలని అన్నారు.చిన్నారులకు ఇచ్చే గుడ్ల పరిమాణం చిన్నగా ఉండటం వల్ల సరైన పోషకాహారం అందదని అన్నారు. పౌష్టిక ఆహారం అందించే విషయంలో నిర్లక్ష్యం చెయ్యొద్దని, నిర్లక్ష్యం చేస్తే ఎవర్ని ఉపేక్షించేది లేదని ఆయన అన్నారు. తిరువూరు క్రాస్ రోడ్ అంగన్వాడి కేంద్రం ఆహ్లాదకరంగా ఉందని పిల్లల హాజరు శాతం కూడా ఎక్కువగా ఉందని వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి నాలుగో వార్డ్ కౌన్సిలర్ భుక్యరాంబాయి అంగన్వాడి టీచర్ని అభినందించారు. అనంతరం ఎంపీపీ ఎస్ స్కూల్ ను సందర్శించి విద్యార్థుల కు అందించే మెనూ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి టీచర్ల పనితీరును తెలుసుకున్నారు. విద్యార్థులకు ఉత్తమ విద్య అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు మున్సిపాలిటీ మేనేజర్ నంది శెట్టి నాగేశ్వరావు, టౌన్ అధ్యక్షుడు ఉస్మాన్, నాయకులు నోటి కృష్ణారెడ్డి, యాస శ్రీకాంత్, రాజబోయిన శ్రీనివాసరావు, ఇబ్రహీం, మున్సిపాలిటీ సిబ్బంది మూడ్ రాము, పాగా శ్రీనివాసరావు, బాబు గౌడు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# కల్లూరు మున్సిపాలిటీలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక సమావేశం



**కల్లూరు సూర్య టౌన్ న్యూస్ 5 :**

పుర చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ అధ్యక్షతనా 99 రోజుల 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' సమావేశం గురువారం పురపాలక భవనంలో నిర్వహించడం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం మార్చి 6 నుంచి జూన్ 12 వరకు అమలు చేసే 10 ముఖ్య అంశాలపై కౌన్సిలర్లు చర్చించారు చైర్మన్ మోహన్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన 10 అంశాలను 20 వార్డుల్లో పగడ్బందీగా అమలు చేస్తామని పరిసరాల పరిశుభ్రత నుంచి ప్రభుత్వ ఫైళ్ల క్లియరెన్స్ వరకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. కౌన్సిలర్లు, కార్మికులు భాగస్వాములుగా మొబైల్ యాప్‌లో పురోగతి ట్రాక్ చేస్తామని తెలిపారు. ప్రధాన 10 అంశాలు ఐన పరిసరాల పరిశుభ్రత వార్డుల్లో పూర్తి క్లీనప్ ప్రారంభం పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ ప్రజల అర్జులు 100% పరిష్కారంఆరోగ్యం వైద్య శిబిరాలు, ఆసుపత్రుల మెరుగుదలఅరైవ్-అలైవ్ రోడ్డు భద్రత, మరమ్మత్తు పనులుసంక్షేమం: పథకాలు అందరికీ వితరణ పిల్లల భద్రత డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమాలురైతు సంక్షేమం వ్యవసాయ సహాయం, నీటి సరఫరావిద్య పాఠశాలల్లో మౌలిక సదుపాయాలుయువత-క్రీడలు శిక్షణ కేంద్రాలుమహిళలు-పర్యావరణం అను అంశాలు సమావేశం ముందస్తు అమలుకు మార్గదర్శకంగా నిలిచిందని, కల్లూరు ను నంబర్ వన్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని చైర్మన్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి మున్సిపల్ కమీషనర్ ఎం. రామదుర్గ రెడ్డి, మున్సిపల్ మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరరావు, వార్డుల కౌన్సిలర్లు , బిల్ కలెక్టర్ , మెప్మా రిసోర్స్ పర్సన్స్, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

# 99 రోజుల యాక్షన్ ప్లాన్‌ను విజయవంతం చేయాలి..

## – మండల ప్రత్యేక అధికారి పరంధామ రెడ్డి...



**అన్నపురెడ్డిపల్లి, సూర్య (మేజర్ న్యూస్)–**
మండలంలో ఈనెల 6 తేదీ నుండి జూన్ 12వ తేదీ వరకు జరిగే ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రోగ్రాంను విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి పరంధామారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి అధ్యక్షతన 99 రోజుల ప్రణాళికపై సర్పంచులు, కార్యదర్శులు, మండల స్థాయి అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు జూన్ 12వ తేదీ వరకు మండలంలో జరుగుతాయని, మొదటగా మార్చి ఆరవ తేదీ నుండి 15వ తేదీ వరకు పంచాయతీ గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో సమస్యల ఫైళ్ల పెండింగ్ లేకుండా చూడాలన్నారు. శుక్రవారం ప్రజా ప్రతినిధులు అధికారులు గ్రామంలో తిరుగుతూ సమస్యలను గుర్తించాలని, గుర్తించిన సమస్యలను క్రమ పద్ధతిలో పూర్తి చేయాలని, సమస్యల పరిష్కారం కోసం అవసరమైన కూలీలు, మెటీరియల్ను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఇలా



పది రోజులు రోజుకో కార్యక్రమం నిర్వహించాలన్నారు ఈ కార్యక్రమాల్లో గ్రామాల్లోని అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలను సందర్శించి వంటగదిని, భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా హౌసింగ్ అధికారి రవీందర్, ఎంపీడీవో కావూరి మహాలక్ష్మి, ఎంపీఓ షేక్ షాబ్నా, ఎంఈఓ ఉండేటి ఆనంద్ కుమార్, గురుకులం ప్రిన్సిపాల్ టి బాలరాజు, పలు శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మన భవిష్యత్తు మన చేతుల్లోనే విద్యార్థులు సన్మార్గంలో నడవాలి

## –డీఎస్పి రవీందర్ రెడ్డి





**మణుగూరు రూరల్,సూర్య(మేజర్ న్యూస్)–**
మన భవిష్యత్తు మన చేతులలోనే ఉంటుందని.. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి సన్మార్గంలో నడవాలని మణుగూరు డీఎస్పీ వంగ రవీం దర్ రెడ్డి అన్నారు. గురువారం మణుగూరు సింగరేణి ఉన్నత పాఠశాల విద్యార్థులతో ప్రధానో పాధ్యాయులు ఆర్ కళ్యాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఎస్పి మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఎదురయ్యే వివిధ సమస్యలను ఎదుర్కొనేందుకు విచక్షణతో ముందుకు సాగాలన్నారు. ఈ వయసులో ప్రభావితం చేసే వివిధ సామాజిక మాధ్యమాల వల్ల, చెడు వ్యసనాలకు లోనయ్యే ప్రమాదం ఉందని, వీటికి దూరంగా ఉంటూ చదువు పైనే దృష్టి మరల్చాలని, దుర్వ్యసనాల వల్ల సమాజంలో జరుగుతున్న వివిధ పరిణామాలను ఉదాహరణలతో వివరించారు. మైనర్ విద్యార్థులు వాహనాలు నడపడం నిషేధమని, తద్వారా వారి తల్లిదండ్రులకు కూడా కేసు నమోదవుతుందని ఈ సందర్భంగా తెలిపారు. విద్యార్థులు అడిగిన అనేక ప్రశ్నలకు వారు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు ఎం వేణు, మస్తానయ్య, లలిత మమత, రాజా సింహ, దయానంద్, స్రవంతి, కళ్యాణ్, రజిత తదితరులు పాల్గొన్నారు.

# మొల్ల స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు

## –కరపత్రాన్ని విడుదల చేసిన సేవా సంస్థ సభ్యులు



**మణుగూరు రూరల్,సూర్య (మేజర్ న్యూస్)–**
ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలను 8 వతేదీన మొల్ల స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు సభ్యులు తెలిపారు. గురువారం గౌరవ అధ్యక్షులు గురజాల శ్రీనివాసులు ప్రజాపతి ఆదేశాల మేరకు గౌరవ సలహాదారులు గంగాధర వీరయ్య సలహాల తో సంస్థ వ్యవస్థాపకులు చెరుకుపల్లి ఉపేందర్ రావు అధ్యక్షతన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించదలిచినామని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ రావు, సిఐ నాగబాబు, ఆర్టీసీ డిపో మేనేజర్ కే శ్యాంసుందర్ లు విచ్చేయుచున్నారని అలాగే మహిళా సోదరీమణులందరికీ పేరుపేరునా శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ కార్యక్రమానికి మహిళా సోదరీమణులు పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని కోరారు.
కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఇండ్ల లక్ష్మణ్, అలాగే శాలివాహన ప్రముఖులు తెగుళ్ల శ్రీనివాస్, నిమ్మనగోటి వీరయ్య, దామర కుమార్ స్వామి, సంస్థ ఉపాధ్యక్షురాలు ఉప్పాడ అనిత, సింగర్ జ్యోతి తదితర మహిళలు మరియు బస్టాండ్ కంట్రోలర్ ప్రభాకర్ పాల్గొన్నారు.


# గుర్తు తెలియని వ్యక్తి మృతదేహానికి అంత్య క్రియలు నిర్వహించిన అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు



**ఖమ్మం, సూర్య (మేజర్ న్యూస్):**
ఈనెల 1వ తారీఖు నాడు ఖమ్మం జిఆర్పి పోలీస్ పరిధిలోని అగ్రహారం బ్రిడ్జి కింద 25 సంవత్సరాల గుర్తుతెలియని మగ వ్యక్తి రైలు కిందపడి మృతి చెందాడు. అతని చేతి మీద హిందీలో సంజయ్ ఇంగ్లీషులో జోటి అని కుడి చేతికి పచ్చబొట్టు ఉన్నది. ఇప్పటివరకు మృతుడి కోసం ఎవరూ రానందున గుర్తు తెలియని అనాథ శవంగా భావించిన ఖమ్మం జిఆర్పి పోలీసులు ఈ అనాథ మృతదేహాన్ని అంత్యక్రియలు చేయమని లిఖితపూర్వకంగా ఇచ్చినందున స్పందించిన అన్నం ఫౌండేషన్ ఖమ్మం ప్రభుత్వ వైద్యశాల మార్చురీ వద్దకు చేరుకొని పోలీసులు వైద్యశాల సిబ్బంది సమక్షంలో మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని తెల్ల వస్త్రంలో చుట్టి పూలు పూల దండలతో గౌరవించి బల్లేపల్లి వైకుంఠ దామానికి తరలించి దహన సంస్కారం నిర్వహించారు చేసిన అన్నం ఫౌండేషన్ ఈ కార్యక్రమంలో అన్నం పౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాపాలన కార్యక్రమానికి సిద్ధమైన జిల్లా ప్రజా ఆరోగ్య శాఖ

## జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డా.డి.రామారావు



**ఖమ్మం సూర్య టౌన్ న్యూస్**
రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసుకొని '99 రోజుల కార్యాచరణ (ఆక్షన్ ప్లాన్) ను సిద్ధం చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.డి.రామారావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన '99 రోజుల కార్యక్రమం' ను జిల్లాలో మార్చి 6 నుండి 12 జూన్ వరకు వైద్య ఆరోగ్యశాఖ చేయవలసిన పనులను డైరెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ, హైదరాబాద్ ఆదేశాలను జారీ చేశారు.

అన్ని ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె, బస్తీ దవాఖానాలలో కార్యాలయాల పరి శుభ్రత, పారిశుద్ధ్యం మరియు పరిపాలనా నిర్వహణను మెరుగుపరచాలని, పరిశుభ్రత, సానిటేషన్ డ్రైవ్ నిర్వాహించాలని, 6 నుండి 15 వరకు (10 రోజులు) 'ప్రత్యేక పరిశుభ్రత, శానిటేషన్ కార్యక్రమం నిర్వహించా లని, జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాలు, పల్లె, బస్తీ దవఖానాల ప్రాంగనాలు, పరిస రాలు, చుట్టుపక్కల చెత్త, స్క్రాప్ మెటీరియల్స్, విరిగి పోయిన కుర్చీలు, ఫర్నిచర్, ఉపయోగంలో లేని వస్తువ ులు, పరికరాలు కాలం చెల్లిన మందులను తగు జాగ్రత్త లతో తీసివేయడం, తొలగిం చడం చేయాలనీ, కార్యాలయ ప్రాంగణాల్లో మొక్కలను పెంచి ఆరోగ్యక రమైన వాతావరణం కల్పించడం, కిటికీలు, తలుపులు, ఎలక్ట్రికల్ ఫిట్టింగ్స్, ఫ్యాన్స్, వాష్ బేసిన్స్, బాత్రూంలలో అవసరమైన సదుపా యాలను ఏర్పాటు చేసుకోవడం, జనరేటర్స్, ఆటో పవర్ బ్యాకప్ పరికరాలు సక్ర మంగా పనిచేస్తున్నాయో లేదో తనిఖీ చేయడం, కార్యాలయాల్లో ఫైల్స్, రికార్డ్స్, పెండింగ్ ఫైల్స్ తీసివేయడం, రిజిస్టర్లు అప్డేట్ చేయడం, అడ్మినిస్ట్రేటివ్ విభాగలు, లాబోరేటరీలు, క్షేత్ర స్థాయిలో వున్న ఆరోగ్య ఉప కేంద్రాలలో కూడా సమగ్రంగా స్వచ్ఛత, శుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని, ఈ–ఔషధీ, ఈ–ఉపకరణ్, ఈ–హెచ్.ఐ. ఎం.ఎస్, మరియు ఇతర ఈ–పోర్టల్స్ లో ఎంట్రీస్ ను సకాలంలో అప్డేట్ చేయాలని, 6వ తేది నుండి 31 వరకు మాతా శిశు సంక్షేమ కార్యక్రమాలు, ఇమ్యూనైజేషన్ కార్యక్ర మాలు, గవర్నమెంట్ ప్రభుత్వ ఆసూపత్రులు, మెడికల్ కళాశాలలో వున్న స్పెషలిస్ట్ డాక్టర్లచే ప్రత్యేక మెడికల్ క్యాంప్స్, ఆర్.బి.ఎస్.కే. డాక్టర్లు, సిబ్బందిచే హాస్టల్ల పర్యవేక్షణ, మార్చి 8 నాడు జిల్లాలో హెచ్.పి.వి వ్యాక్సిన్ ను ప్రారంభం చేయడానికి డైరెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల కోసం ఎదురుచూ స్తున్నామని, ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ మహిళా ఉద్యోగులకు ప్రత్యేక మహిళా సాధికారికతను పెంపోందించే కార్యక్రమాలు నిర్వహించడం, ఏప్రిల్ 7న, ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సంధర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం, జూన్ 2 నాడు ప్రత్యేక కార్యక్రమాల ద్వారా ప్రజలకు వైద్యసేవలు అందించడానికి కార్యాచరణ సిద్ధం చేసి, జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని సిద్ధం చేశామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.డి.రామారావు తెలిపారు.

**CHANGE OF NAME**

AKULA SRINIVASA RAO S/o A. Venkanna Age : 63Years, R/o :H.No : 14-1-7/1 SCB, CBJPS 2859F నగర్, రామవరం, కొత్తగూడెం అనే నా పేరు పాస్‌పోర్టు నెంబర్ C3636281 ప్రకారం AAKULA SREENIVASA RAO గా నమోదైనది. కానీ ఆధార్ కార్డు నెం: 373431341675 ప్రకారం మరియు పాన్‌కార్డు నెం : CBJPS 2859F నాపేరు AKULA SRINIVASA RAO గా మార్చుకొంటున్నాను.

# వెలుగుమట్లలో ఇళ్ళు కోల్పోయిన వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలి

-భూదాన్ భూముల విషయంలో పేద ప్రజలకు అండగా బి.జే.పి ఉంటుంది

-మీడియా సమావేశంలో బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు

**ఖమ్మం సూర్య (మేజర్ న్యూస్):**

ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో రెక్కాడితే గానీ డొక్కాడని పేద ప్రజలు గత నెల 24వ తేదీ నుంచి ఇళ్లు కోల్పోయి రోడ్డుపై పడిపోయారని వారి భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని ఈ బాధాకర పరిస్థితిని నేను తీవ్రంగా ఖండిస్తున్నాననీఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ప్రజలను మూడుముక్కలాటలా ఆడుకుంటున్నారు,బాధితులకు బిజెపి అండగా నిలుస్తుందన్నారు.ఇందిరమ్మ రాజ్యం అంటే పేదల ఇండ్లు కూల్చేయడమేనా? ప్రజాపాలన అంటే ప్రజలను రోడ్డుపైకి ఈడ్చడమేనా? అని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ 31.7 ఎకరాల భూమిని కాపాడామని, దాదాపు రూ.250 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని రక్షించామని చెబుతున్నారనీఅది ప్రభుత్వ రెవెన్యూ భూమి కాదు. అది అసైన్డ్ భూమి కాదు అని ఆచార్య వినోబా భావే పిలుపు మేరకు దాతలు తమ కష్టార్జితంతో సేకరించి పేదలకు ఇచ్చిన భూదాన్ భూమి.అని అన్నారు దాన్ని ప్రభుత్వ భూమి అని చెప్పడం తీవ్రమైన అన్యాయమని,1954లో కల్వల రాజారావు ఇచ్చిన భూమి 72 సంవత్సరాలు గడిచినా ఇప్పటివరకు ఆ భూమిని పేదలకు పంచదానికి ఒక్క పేదవాడు దొరకలేదా?అని ప్రశ్నించారు.ఆచార్య వినోబా భావే స్ఫూర్తితో కల్వల రాజారావు కుటుంబం 62 ఎకరాల 16 గుంటల భూమిని భూదాన్ ఉద్యమంలో భాగంగా ఇచ్చిందనీ ,అందులో నుంచి 30 ఎకరాల 7 గుంటల భూమిని కాజేసి, పేర్లు మార్చి, రెగ్యులరైజ్ చేసుకోవడానికి అక్కడి నుంచి పేదలను వెళ్లగొట్టిందన్నారు.కాంగ్రెస్ నాయకుల రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు దన్నుగా ఉండేందుకు పేదలు అక్కడ ఉండకూడదనే కుట్రతో ఇండ్లు కూల్చడాన్ని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది.తెలంగాణలో కాసర పహనీ రికార్డుల ప్రకారం 1984–85 వరకు వెలుగుమట్లలో సర్వే నంబర్ 147లో 20.66 ఎకరాలు, 148లో 22.94 ఎకరాలు, 149లో 18.56 ఎకరాలు వినోబా భావే భూదాన్ యజ్ఞ బోర్డు పరిధిలో ఉన్నట్లు ప్రభుత్వ రికార్డులే చెబుతున్నాయన్నారు.1984 తర్వాత ఈ 31.7 ఎకరాల భూమి ఏమైంది? భూదాన్ పేరు ఎలా మారిపోయింది? దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు.జిల్లా కలెక్టర్ ప్రకటించిన 31 ఎకరాలు, రూ.250 కోట్ల విలువ కలిగినదని చెబుతున్నారు. మరి మిగిలిన 31 ఎకరాలు, అదే రూ.250 కోట్ల విలువైన భూమి ఏమైంది? అని ప్రశ్నించారు.ప్రొహిబిటెడ్ ల్యాండ్స్ పేరుతో రికార్డుల ప్రకారం



వెలుగుమట్లలో భూదాన్ భూములు 25.4 ఎకరాలే ఉన్నాయని చెబుతున్నారు. మరి మిగిలిన 5.6 ఎకరాలు ఎటుపోయాయి? సమాధానం చెప్పాలన్నారు 2014లో విడుదల చేసిన జీఓ నెం.58, 59 ప్రకారం..జీఓ నెం.58.. పేదలు ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఇల్లు కట్టుకుని నివసిస్తే 125 గజాల వరకు రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వం చెబుతోందనీకానీ అదే 59 జీఓ కింద బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు రెగ్యులరైజ్ చేసుకుని కాజేశారనీ ఆరోపించారు.దాతలు పేదల కోసం ఇచ్చిన భూములను కాజేయడం దుర్మార్గ చర్య అని అన్నారు జర్నలిస్టులకు ఇచ్చిన హామీని కనీసం జర్నలిస్టులకు ఖమ్మంలో ఇస్తానన్న భూములు ఇవ్వలేదు అని అన్నారు ఒకవైపు ఇంత అన్యాయం చేస్తూ... మరోవైపు ఇందిరమ్మ పాలన అంటూ గొప్పలు చెప్పుకోవడం దుర్మార్గం.ఇజ్రాయెల్, అమెరికా దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మరణించారంటూ కాంగ్రెస్ నేత సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సంఘీభావం తెలియజేయాలని మాట్లాడుతున్నారు. కానీ ఖమ్మం వెలుగుమట్లలో పేదల ఇండ్లు కూల్చివేసినప్పుడు రేవంత్ ప్రభుత్వంపై ఒక్క మాట మాట్లాడడం లేదు అని అన్నారు ఇటీవల వికారాబాద్ కు వచ్చిన రాహుల్ గాంధీకి వెలుగుమట్లలో పేద ప్రజలు పడుతున్న వేదన కనపడలేదా..? అని ప్రశ్నించారు. పేద ప్రజల పక్షాన బిజెపి మాత్రమే నిలుస్తోందనీ,అధికార అహంకారంతో, అవినీతిలో కూరుకుపోయిన కాంగ్రెస్ నాయకులకు ప్రజలే తగిన బుద్ధి చెప్పాలనీ పిలుపు నిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లుతెరిచి భూదాన్ భూముల్లో కూల్చివేసిన ఇండ్లను తిరిగి నిర్మించి పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలి

## టీజీ వ్యకాస డివిజన్ కార్యదర్శి జాజిరి శ్రీనివాస్



**పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్....**

పెనుబల్లి మండలం మండాల పాడు గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పనులను గురువారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం పెనుబల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో సందర్శించారు. అక్కడ పనిచేస్తున్న కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎం జి ఎన్ ఆర్ ఈ జి ఏ ఉపాధాని కూలీలకు ఒక చట్టబద్ధమైన హక్కును కల్పించిందన్నారు. ప్రజలు పని కావాలని కోరితే ప్రభుత్వం పని కల్పించాలి, లేదంటే పరిహారం చెల్లించాలనే హక్కు పాత చట్టంలో ఉందని గుర్తు చేశారు. మోడీ కొత్తగా తీసుకొచ్చిన వీబీ జీఆర్ఏఎం జీ లో పని హక్కు లేదని తెలిపారు. అది కేంద్రం "దయాదాక్షిణ్యం' గా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ సీజన్లో 60 రోజులపాటు పనిని నిషేధించారని, ఇది ఉపాధి హామీ భద్రతకు పూర్తి విరుద్ధమని విమర్శించారు. 125 రోజులు పని కల్పిస్తామని వాగ్దానం పెద్ద అబద్ధం అన్నారు. ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న రాష్ట్రాలను 40% భరించాలని కేంద్రం 60% భరిస్తుందని కొత్త పథకాలు పెట్టడం పేదలకు పని లేకుండా చేయడమేనని ఆయన అన్నారు. గత ఐదు వారాలుగా కూలి డబ్బులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు గాయం తిరుపతిరావు మాట్లాడుతూ ఉదయం ఫోటో, సాయంత్రం ఫోటో విధానాన్ని రద్దు చేయాలన్నారు. వికసిప్ భారత్ – జి రామ్ జి 2025 /197 బిల్లును రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కమిటీ సభ్యులు కువారపు లక్ష్మణరావు, గ్రామ కమిటీ దాసరి కృష్ణకుమారి పింగిలి మణి ఎక్కిరాల సుశీలమ్మ ఇడుపులపాటి వెంకటమ్మ దవికమళ్ళ ఇందిరమ్మ కొరకప్పు పాప తడికమల చిన్న సత్యం నల్లగట్ల నాగేశ్వరరావు కొరకోపు ఆదాం సరోజినీ సునీత తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా కనపర్తి జన్మదిన వేడుకలు







**కల్లూరు సూర్య టౌన్ న్యూస్ మార్చి 5 :**

మున్సిపాలిటీ లో గల అంబేద్కర్ నగర్ కు చెందిన బి ఆర్ ఎస్ పార్టీ యువ నాయకులు సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య ప్రధాన అనుచరులు మానవత్వ మూర్తి ఆదర్శప్రాయుడు విద్యా వేత్త ప్రముఖ బిజినెస్ నేత అయినటువంటి 17వ వార్డు యువ మహిళా పుర కౌన్సిలర్ కనపర్తి శ్యామల రాజ్ కుమార్ 41వ జన్మదినాన్న తన నివాస గృహమైనటువంటి అంబేద్కర్ నగర్ లో స్నేహితులు కుటుంబ సభ్యులు నడుమ భారీ కేకును కట్ చేసి 41వ జన్మదినాన్ని పూర్తిచేసుకొని 42వ జన్మదినలో అడుగిడిన శుభ తరుణంలో రాజ్ కుమార్ కు సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య చరవాణీ ద్వారా ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు అందులో భాగంగా బి ఆర్ ఎస్ పార్టీ నేతలు స్నేహితులు బంధువులు ప్రత్యేకంగా జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు అనంతరం పలు చర్చిలలో రాజకుమార్ జన్మదిన సందర్భంగా పాస్టర్ దయాకర్ ప్రత్యేక ప్రార్ధనలు చేశారు అందులో భాగంగా రాజ్ కుమార్ తన సతీమణి 17వ వార్డు మహిళా యువ పుర కౌన్సిలర్ శ్యామల వారి కుటుంబ సభ్యులతో సహా ప్రత్యేక ప్రార్ధనలు జరుపుకున్నారు అనంతరం శ్యామల రాజ్ కుమార్ మాట్లాడుతూ మాకు ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని బట్టి ప్రతి ఒక్కరికి అందు బాటులో ఉంటూ ప్రత్యేకంగా వారి సమస్యల పైనే పోరాడి ముమ్మాటికి వారి కోసం పరితపిస్తానని వారు తమ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో రాజకుమార్ స్నేహితులు బంధువులు యూత్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని రాజ్కుమార్ జన్మదిన వేడుకలను అంగరంగ వైభవముగా జరుపుకున్నారు.

# టెట్ గండం గట్టెక్కిన ఉపాధ్యాయులు



**సూర్య ప్రతినిధి ఖమ్మం**

సుప్రీంకోర్టు తీవ్ర ఆదేశాలతో గత జనవరిలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ హాజరైన టీచర్స్ లో 37803 మంది అర్హత సాధించారు. 27712 అర్హత సాధించలేకపో యారు. కాగా మొత్తం ఈ పరీక్షకు 65 వేల 605 మంది ప్రభుత్వ టీచర్లు హాజరయ్యారు. టెట్ ప్రవేశపెట్టక ముందు నియమితులైై ప్రస్తుతం ఐదేళ్లకు మించి సర్వీసు ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులు రెండేళ్లలోపు తప్పనిసరిగా టెట్ రాసి అర్హత సాధించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. లేదంటే సదరు ఉపాధ్యాయులు తమ ఉద్యోగాన్ని కోల్పోవాల్సి వస్తుందని తీవ్రంగా వ్యాఖ్యానించింది. ఈ మేరకు గత ఏడాది సెప్టెంబర్ లో కీలక ఉత్తర్వులు జారీ చేసింది ఈ నేపథ్యంలో తాజాగా టెట్ ఫలితాల్లో పరీక్ష రాసిన ప్రభుత్వ ఉపాధ్యాయులలో 42.24% మంది అర్హత సాధించలేకపోయారు అందులో గణితం సామాన్య శాస్త్రం సాంఘిక శాస్త్రం సబ్జెక్టులు బోధించే టీచర్లు అయితే 50% కూడా అర్హత సాధించలేకపోయారు. పరీక్షకు ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇతరులు కలిపి మొత్తంగా 195,181 మంది హాజరయ్యారు. వీరిలో 100270 మంది అర్హత సాధించారు. దీంతో మొత్తంగా టెట్టు అర్హత శాతం(51.37) గా నమోదయింది. గత జనవరిలో జరిగిన ఈ పరీక్షల ఫలితాలను పాఠశాల విద్యాసంచాలకులు నవీన్ నికోలస్ ఇటీవల విడుదల చేశారు ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో పేపర్ వన్ కు 25347 మంది పరీక్ష రాయగా 19557(77.03%) మంది అర్హత సాధించారు గణితం. సామాన్య శాస్త్రానికి సంబంధించిన పేపర్ 2 పరీక్షకు 23,293 మది హాజరు కాగా 11, 444 మంది (49.13%) మాత్రమే అర్హత సాధించారు సాంఘిక శాస్త్రం పేపర్–3 లో 16,925 మంది ఉపాధ్యాయుల్లో 6,892 (45.72) శాతం మంది అర్హత సాధించారు సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు అర్హత సాధించలేకపోయిన వారు మరో ఏడాదిన్నరలో మూడు సార్లు నిర్వహించనున్న టెట్లో తప్పనిసరిగా అర్హత సాధించాల్సి ఉంటుంది.

"వినిగండ్ల శ్రీనివాస్ రావు" సీనియర్ జర్నలిస్ట్...

# సర్వం అగ్నికి ఆహుతై కన్నీరే మిగిలింది

**- నగలు, నగదు, వస్తు సామాగ్రి అగ్నికి ఆహుతి**

**- సుమారు 13 లక్షలు ఆస్థి నష్టం**

**-రోడ్డును పడ్డ తండ్రి కుమారుల రెండు కుటుంబాలు.**











**పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్....**

సర్వం మంటల్లో కాలి బూడిదై రెండు కుటుంబాలు రోడ్డున పడ్డాయి. షార్ట్ సర్క్యూటై ఇల్లు మొత్తం అగ్నికి ఆహుతై కట్టు బట్టలతో రోడ్డుపై రోధిస్తూ నిలుచున్న రెండు కుటుంబాలు దీనస్థితిని స్థానికులను కలిసివేసింది. అగ్ని ప్రమాదంలో ఇల్లు అగ్నికి ఆహుత అయిన ఘటన పెనుబల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఇంట్లో మనుషులు ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పి భారీ ఆస్తి నష్టం సంభవించింది. వివరాల్లోకి వెళితే పెనుబల్లి మండలం లింగగూడెం గ్రామంలోని ఎస్టి కాలనీ నివాసముంటున్న రసపుత్ర నాగేశ్వరరావు, రసపుత్ర మధు తండ్రి కుమారులు ఒకే ఇంటిలో నివాసం ఉంటున్నారు. గురువారం ఉదయం మిరప తోటలో కూలి పనికి వెళ్లారు. మధ్యాహ్న సమయంలో షార్ట్ సర్క్యూట్తో పూరింటికి మంటలు వ్యాపించి ఇల్లు మొత్తం పూర్తిగా దగ్ధమైంది. ఇంటిలో ఉన్న వస్తు సామాగ్రి మొత్తం అగ్నికి ఆహుతయ్యింది. సుమారు రూ. 13 లక్షలు నష్టం వాటిలిందని బాధితులు కన్నీరు మున్నీరుగా రోదిస్తున్నారు. రూ. 6 లక్షలు విలువ చేసే బంగారపు ఆభరణాలు, రూ. 3 లక్షలు నగదు, 2 బీరువాలు, రెండు డబుల్ కాట్ లు, ఇంటి పత్రాలు, స్టడీ సర్టిఫికెట్లు, రెండు ఫ్రిజ్లు, టీవీలు, బట్టలు, వస్తు సామాగ్రి సమస్తం మంటల్లో కాలి బుడిదే మిగిలింది. ఇంటిలో రెండు గ్యాస్ సిలిండర్లు ఉన్నాయి. గ్యాస్ సిలిండర్లు పేలినట్లయితే ప్రమాద తీవ్రత మరింత ఎక్కువగా ఉండేది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలేని చేరుకొని మంటలని అదుపులోకి తెచ్చి ప్రమాద తీవ్రతను తగ్గించారు. అగ్ని ప్రమాద సమయంలో కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ అగ్ని ప్రమాద ఘటనలో సమస్తం కోల్పోయి చేతిలో నయా పైసా లేకుండా కట్టు బట్టలతో ఆ కుటుంబాలు రోడ్డున పడ్డాయి. రెవిన్యూ అధికారులు ఘటన స్థలాన్ని ప్రమాద తీవ్రతను పరిశీలించి నష్టాన్ని అంచనా వేశారు. బియ్యంతో సహా ఇల్లు సమస్తం అగ్నికి ఆహుతై బూడిద మిగలడంతో ఆ కుటుంబానికి కన్నీరే మిగిలింది.

# ఏసీ గదుల్లో అధికారులు.. అనాథల్లా పేదలు

**-రియల్ ఎస్టేట్ మాఫియా కోసమే పేదల ఇళ్ల కూల్చివేత -ప్రభుత్వం ప్రకటించిన 15 రోజుల గడువు అంతా పొలిటికల్ డ్రామాయే,-ఏ చేతులతో గెంటేశారో.. అదే జాగలో పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలి,- ఖమ్మంలో మీడియాతో బీజేపీ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు, జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు.**



**ఖమ్మం, సూర్య (మేజర్ న్యూస్):**

నిరుపేదలను దయాదాక్షిణ్యం లేకుండా బయటకు గెంటివేసి, కనీస ప్రాథమిక వసతులు లేని అంబేద్కర్ భవన్లో అనాథల్లా వదిలేశారని బీజేపీ రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు, జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, నాయకులు ఏసీ గదుల్లో ప్రశాంతంగా కూర్చుంటే, నిరాశ్రయులైన పేదల ఉసురు తగులుతుందని వారు హెచ్చరించారు. గురువారం ఖమ్మం నగరంలోని అంబేద్కర్ భవన్లో బీజేపీ రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు, జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు సంయుక్తంగా ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, బడా బాబులకు కొమ్ముకాస్తున్న అధికారుల ద్వంద్వ వైఖరిని వారు తీవ్రంగా ఎండగట్టారు.పదేళ్లుగా అక్కడ నివసిస్తున్న పేదలను చూసీ చూడనట్లు వదిలేసిన యంత్రాంగం, ఉన్నపళంగా వందలాది మంది పోలీసులతో, జేసీబీలతో అర్ధరాత్రి దాడులకు తెగబడటం వెనుక భారీ రియల్ ఎస్టేట్ మాఫియా హస్తం ఉందని బీజేపీ నేతలు ఆరోపించారు. కొత్త కలెక్టరేట్ సమీపంలో ఉండటం వల్లే ఆ భూమి విలువ వందల కోట్లకు చేరిందని, ఆ కుబేరుల కోసమే పేదల ఇళ్లపైకి బుల్డోజర్లు పంపారని విమర్శించారు. బడా బాబుల ఫామ్ హౌస్లు, అక్రమ భవనాలకు ముందుగా నోటీసులు ఇచ్చి వారు కోర్టు స్టేలు తెచ్చుకునేదాకా వేచి చూసే అధికారులు, పేదల గుడిసెల విషయంలో మాత్రం కనీస సమయం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇది కాంగ్రెస్ చెబుతున్న 'ఇందిరమ్మ రాజ్యమా' లేక పేదల పొట్టకొట్టే 'బుల్డోజర్ రాజ్యమా' అని నిలదీశారు.అనంతరం భూదాన భూముల లెక్కలపై అధికారుల తీరును బీజేపీ నేతలు తూర్పారబట్టారు. 1957 కాసరా పహాణీ ప్రకారం 57 ఎకరాలు ఉన్న సువిశాలమైన భూదాన భూమి ఇప్పుడు కేవలం 27 ఎకరాలకు ఎలా తగ్గిపోయిందని ప్రశ్నించారు. గతం నుంచి నేటి వరకు కొందరు పాలకులకు ఈ భూములను ధారాదత్తం చేశారని మండిపడ్డారు. సుమారు 250 కోట్ల విలువైన భూమిని కాపాడామని చెబుతున్న జిల్లా కలెక్టర్, చివరకు 27 ఎకరాలు మాత్రమే మిగిలిందని చెప్పడం వెనుక ఉన్న మతలబు ఏమిటో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ పూర్తిగా కాంగ్రెస్ నేతల కనుసన్నల్లో పనిచేస్తూ ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం నగర పరిధిలోని 8వ డివిజన్లో పట్టణ ప్రకృతి వనాలను బడా బాబులు ఆక్రమించుకొని దర్జాగా భవనాలు నిర్మిస్తుంటే అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు.బాధితుల ఆగ్రహాన్ని, ప్రతిపక్షాల ఒత్తిడిని దారి మళ్లించేందుకే ప్రభుత్వం పొలిటికల్ మైండ్ గేమ్ ఆడుతోందని నేతలు విమర్శించారు. మార్చి 15 నాటికి స్థలాలు, ఐదు లక్షల రూపాయలు ఇస్తామంటూ ప్రభుత్వం చెబుతున్న మాటలు కేవలం 'డెడ్ లైన్ డ్రామా' అని కొట్టిపారేశారు. అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్న పేదల ఆర్థిక నష్టాన్ని ఎవరు భర్తీ చేస్తారని నిలదీశారు. పేదల నుంచి ముప్పై వేల నుంచి ఎనిమిది లక్షల రూపాయల వరకు వసూలు చేసిన దళారుల వెనుక ఉన్న అధికార పార్టీ పెద్దలను బహిర్గతం చేసి, వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని కోరారు. అలాగే అక్రమ కట్టడాలైతే అప్పట్లో కరెంటు, నల్లా కనెక్షన్లు ఇచ్చిన అధికారులపై సస్పెన్షన్ వేటు ఎందుకు వేయలేదని లాజికల్ గా ప్రశ్నించారు. ఇంటెలిజెన్స్, రెవెన్యూ విభాగాలు పూర్తిగా వైఫల్యం చెందాయా లేక పాలకుల కనుసన్నల్లోనే ఈ దందా నడిచిందా అని అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ మొత్తం వ్యవహారం వెనుక ఉన్న భూకబ్జాదారుల పాత్రపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని సవాల్ విసిరారు. అభాగ్యులైన పేదల ఇళ్లను కూల్చిన ఈ దారుణ ఘటనపై కాంగ్రెస్ ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని, సీఎం రేవంత్ రెడ్డి, సంబంధిత మంత్రులు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఏ చేతులతో అయితే అమాయక ప్రజలను నిర్దాక్షిణ్యంగా బయటికి గెంటివేశారో.. మరల అదే భూదాన ప్రాంతంలో నిరుపేదలందరికీ వంద గజాల చొప్పున స్థలాలు ఏర్పాటుచేసి పక్కా భవనాలు నిర్మించి ఇవ్వాలని స్పష్టం చేశారు. అర్హులైన పేదలందరికీ ఇళ్లు ఇచ్చే వరకు, నిధుల కేటాయింపుపై స్పష్టమైన జీవో వచ్చే వరకు బీజేపీ ఈ ఉద్యమాన్ని ఉధృతం చేస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వర్లు, నాయకులు మందడపు సుబ్బారావు, రవిరాథోడ్, నకిరేకంటి వీరభద్రం, నెల్లూరి బెనర్జీ, శాసనాల సాయిరాం, మణికంత, వాకదాని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 8న అంతర్జాతీయ మహిళ దినోత్సవంను జయప్రదం చేయండి

**ఖమ్మం సూర్య టౌన్ న్యూస్**



పి ఆర్ టి యు జిల్లా కార్యాలయంలో మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా జరిగే కార్యక్రమాన్ని చర్చించడానికి మహిళా కమిటీ సమావేశము ఏర్పాటు చేయడమైనది . ఆరోజు మహిళలకు పిఆర్టియు జిల్లా కార్యాలయంలో గేమ్స్ ను నిర్వహించి అనంతరం మహిళా సాధికారత అనే అంశంపై సెమినార్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు . ఇటి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీమతి అంజలి హాజరుకానున్నారు . ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు సుజాత , భారతి , రెహానా , మాధవి , సైదారాణి , స్నేహలత , నఫీజ తదితరులు పాల్గొన్నారు .

# వేణు గోపాల స్వామి ఆలయంలో అన్న ప్రసాద వితరణ



**ఖమ్మం సూర్య (మేజర్ న్యూస్):**

శ్రీ కృష్ణ సాయి ఆశ్రమం అనుబంధంగా ఉన్న వేణుగోపాలస్వామి మందిరం రంగనాయకుల గుట్ట మూడో తారీకు చంద్రగ్రహణం సందర్భంగా జరగవలసిన శ్రీ వేణుగోపాలస్వామి వారి కళ్యాణం నిలుపుదల చేసి వేణుగోపాలస్వామి వారి కళ్యాణం అన్న ప్రసాద వితరణ జరిగింది. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు అయ్యారు. ఈ కార్యక్రమంలో సుందర సత్సంగం పంపింగ్ వెల్ రోడ్డు ఉప శాఖ కార్యనిర్వాహ కులు గుండా మహేష్ మోదడుగు జ్యోతి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీ కృష్ణ సాయి ఆశ్రమం సౌజన్యంతో కమిటీ సభ్యుల పర్యవేక్షణలో చక్కగా జరిగింది

# ఘనంగా ముగిసిన బాలాజీ బ్రహ్మోత్సవాలు

**వైభవంగా మహా పూర్ణాహుతి, చక్రస్నానం, శృంగార డోలోత్సవం..**





అన్నపురెడ్డిపల్లి, సూర్య (మేజర్ న్యూస్)–మండల కేంద్రంలోని ప్రముఖ వైష్ణవాలయం, కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో 6 రోజులు పాటు జరిగిన వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారంతో ఘనంగా ముగిసాయి.బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, బాల బోగ నివేదన, మహా పూర్ణాహుతి, పంచామృత అభిషేకాలు, మహా నివేదన, వసంతోత్సవం, చక్రస్నానం వైభవంగా నిర్వహించి వాటి ప్రాముఖ్యతను యజ్ఞాచార్యులు ఆచార్య సాదిప్ తెలియజేశారు.మహా పూర్ణాహుతి, వసంతోత్సవం, చక్రస్నానం కార్యక్రమాల్లో ఆలయ మేనేజర్ పాకల వెంకటరమణ శర్మ, ఆలయ మాజీ చైర్మన్ వనమా గాంధీ భారతి దంపతులు, పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని చక్రస్నానం ఆచరించారు. సాయంత్రం స్వామివారికి శ్రీ పుష్పయాగం, దేవతోద్వాసన, ధ్వజారోహణము, శృంగార డోలోత్సవం, అర్చక పండిత సత్కారం, నివేదన, తీర్థ ప్రసాద గోష్టి తో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి.

## విద్యార్థుల్లో కనీస సామర్థ్యాల సాధన కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలి






**–మండల స్థాయి ఎఫ్ ఎల్ ఎన్ బాలమేళా**

పాల్వంచ,సూర్య (మేజర్ న్యూస్)– విద్యార్థుల్లో కనీస సామర్థ్యాల సాధన కోసం ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని పాల్వంచ మండల విద్యాశాఖ అధికారి ఏ శ్రీరామ్ మూర్తి కోరారు. పాల్వంచ పట్టణంలోని కేటీపీఎస్ ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన ఎఫ్ఎల్ఎన్ బాలమేళా కార్యక్రమం ను ఆయన ప్రారంభించారు. మండలంలోని ప్రాథమిక పాఠశాలలో అలాగే కాంప్లెక్స్ వారీగా ఎఫ్ ఎల్ సామర్థ్యాలపై బాలమేళా నిర్వహించి అక్కడ ఎంపికైన విద్యార్థులను మండల స్థాయి పాల్వంచలో గురువారం జరిగిన కార్యక్రమానికి మండల వ్యాప్తంగా 50 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు ఎఫ్ ఎల్ ఎన్ సామర్థ్యాలపై ఐదుగురిని అలాగే లైబ్రరీ పై స్టోరీ టెల్లింగ్ ద్వారా ఐదుగురిని ఎంపిక చేసి వారికి పాల్వంచ తాసిల్దార్ ధారా ప్రసాద్ ఎంఈఓ శ్రీరామ్మూర్తి చేతుల మీదుగా విద్యార్థులకు ప్రశంసా పత్రాలు బహుమతులను అందజేశారు. మండల స్థాయిలో ఎంపికైన పదిమంది విద్యార్థులను ఈనెల 9వ తేదీన జిల్లాలో జరిగే ఎఫ్ ఎల్ ఎన్ బాలమేళాకు పంపించమన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ, తాసిల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు కు ప్రాథమిక స్థాయిలో కనీస సామర్థ్యాలైన చదవడం రాయడం చతుర్విధ ప్రక్రియలు గణితం ఇంగ్లీషు తదితర అంశాలపై పట్టు సాధించే విధంగా ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే కనీస సామర్థ్యాలు విద్యార్థులు సాధించినట్లయితే పై తరగతికి పోయేసరికి వారిలో మరింత చదువులో సామర్థ్యం మరింత పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రవికుమార్ రెడ్డి, డిఆర్పిలు రాజశేఖర్, తుక్కాని శ్రీనివాసరెడ్డి ,శోభన్, మంజు శ్రీ, గీత తదితరులు పాల్గొన్నారు.

## ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ దురాక్రమణ దాడిని ఖండించాలి

**– మాస్ లైన్ నాయకురాలు చంద్ర అరుణ**

ఇల్లందు ఆర్ సి, సూర్య (మేజర్ న్యూస్)–ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ దురాక్రమణను ఖండించాలని సిపిఐ ఎంఎల్ (మాస్ లైన్) డిమాండ్ చేస్తూ ఇల్లందు పట్టణంలో దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి మాస్ లైన్ నాయకులు పాయం వెంకన్న అధ్యక్షత వహించగా జరిగిన సభలో పార్టీ రాష్ట్ర నాయకురాలు చంద్ర అరుణ పాల్గొని మాట్లాడుతూ పశ్చిమ ఆసియాపై, ఆయిల్పై ఆధిపత్యం కోసమే ఇరాన్పై అమెరికా, ఇజ్రాయెల్ దురాక్రమణ దాడులకు, యుద్ధానికి దిగింది. ఇది అత్యంత హేయమైన, అన్యాయమైన చర్య. ప్రపంచ ఆధిపత్య ధోరణి. విధానం అన్నారు.ఇరాన్ అధ్యక్షుడు ఖుమేనీని 30 అధునాతన అయిల్ బాంబులతో హత్య చేసినట్లు తెలుస్తోంది. నిన్న వెనుజుల అధ్యక్షుడు మదురోనీ ఎత్తుక పోయి ఆ దేశాన్ని అదుపులోకి తెచ్చుకున్నారు. మొన్న గాజానీ మరుభూమిగా మార్చారు. ఇవ్వాళ ఇరాన్పై ఉన్మాద దురాక్రమణకు పూనుకున్నారు.ప్రపంచ వనరులు కొల్లగొట్టడానికి, ప్రపంచ వాణిజ్య, రాజకీయ, ఆర్థిక ఆధిపత్యం కోసం అమెరికా, దాని పెంపుడు జంతువు ఇజ్రాయెల్ మారణహోమం చేస్తూ, రక్తపు చేతులతో మానవత్వం, ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నది. ఇది నగ్నమైన అమానుష చర్యలకు దొంగ ముసుగు మాత్రమే.నరహంతకులతో చేతులు కలుపుకొని, ఆలింగనాలూ భారత దేశం చేసుకోవడమే రక్త, నరహంతక చర్యలలో భాగం కావడమే. మోడీ, ట్రంప్, నేతన్యాహు త్రయం జాతి విద్వేష విధానాలలో, నరహంతక చర్యలలో అన్నతమ్ములుగా మారారు. ఇది మన దేశ పౌర సమాజంకు అవమాన మన్నారు.ఇరాన్ పై దాడిని మాస్ లైన్, కేంద్ర రాష్ట్ర కమిటీలు తీవ్రంగా ఖండిస్తున్నది. వెంటనే యుద్ధం ఆపాలని డిమాండ్ చేస్తున్నది. అంతర్జాతీయ సంస్థలు జ్యోకం చేసుకోవాలని కోరుతున్నది. నరహంతకులతో మోడీ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలన్నీటిని రద్దు చేసుకోవాలని కోరుతున్నది. భారత్ లాంటి అలీన దేశం.. ప్రజాస్వామిక దేశం ప్రపంచ హంతకులతో చేతులు కలుపుకోవడం దేశ ప్రజలందరినీ అవమానించడమేనన్నారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ ఇల్లందు ఏరియా కార్యదర్శి మల్లెల వెంకటేశ్వర్లు బొల్లి రవి చందర్,అన బత్తుల నరేష్,లింగయ్య, కే వెంకటయ్యా,బొల్లి కృష్ణశామ్, తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం భట్టి తనయుని వివాహానికి హాజరైన డాక్టర్ రవి



ఇల్లందు ఆర్సి, సూర్య(మేజర్ న్యూస్)–తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తనయుడు సూర్య విక్రమాదిత్య వివాహ వేడుకల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ ఎస్టి సెల్ చైర్మన్ డాక్టర్ జి రవి పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనతో పాటు ఇల్లందు పట్టణ సీనియర్ కాంగ్రెస్ నాయకులు అన్నం సత్యనారాయణ, గౌడుగు వేణు,ప్రసన్న కుమార్, ముత్యాల లక్ష్మణ్,ఎండి ఇబ్రహీం, మాజీ ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ లింగాల జగన్నాథం, వెంకటేష్ పాల్గొన్నారు.

## కలెక్టర్ ను సన్మానించిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు



పాల్వంచ,సూర్య (మేజర్ న్యూస్)– భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన అంకిత్ ని గురువారం ముత్యాల విశ్వనాథం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ క్రమంలో కలెక్టర్ కి బొకే ఇచ్చి శాలువాతో సత్కరించారు. వారితోపాటు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు.వీసంశెట్టి పూర్ణచంద్రరావు. 47వ డివిజన్ కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు గుర్రం వెంకటరత్నం 35వ డివిజన్ నాయకులు నామా నవీన్ నామ పండు లాల్ పాషా . వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## బాలికలకు శానిటరీ ప్యాడ్స్ పంపిణీ

టేకులపల్లి సూర్య (మేజర్ న్యూస్)–జుమ్మి టెక్నాలజీస్ సి ఎస్ ఆర్ ఆక్టివిటీస్ లో భాగంగా టేకులపల్లి మండలం లోని బోడు జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో ఆరవ తరగతి నుండి 10వ తరగతి చదువుతున్న 47 మంది బాలికలకు, ప్రతి ఒక్కరికి 3 చొప్పున,జుమ్మి ఫౌండేషన్ఆధ్వర్యంలో శానిటరీ ప్యాడ్స్ పంపిణీచేసినట్లు గురువారం తెలిపారు. బాలికల ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడానికి ఏర్పాటు చేశామన్నారు. బోడు పోలీస్ స్టేషన్. ఎస్ఐ. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. విద్యార్థినులకు మహిళల భద్రత, నేరాలపై జాగ్రత్తలు అవగాహన గురించి వివరించారు.జుమ్మి ఫౌండేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ .కమల , బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత (పర్సనల్ హైజీన్), మెన్స్ట్రువల్ హైజీన్ గురించి అవగాహన కల్పిస్తూ ,శానిటరీ ప్యాడ్స్ వినియోగం ప్రాముఖ్యతను వివరించారు.జుమ్మి టెక్నాలజీస్ ఎండి.శ్యాంలాల్ ప్రాజెక్ట్స్ మేనేజర్, మదన్ మోహన్ , పాఠశాల ప్రధానోపాధ్యాయులు జగన్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది విజయవంతం చేశారన్నారు. విద్యార్థినులకు ఆరోగ్యం, భద్రతపరిశుభ్రతపై మంచి అవగాహన కల్పించారు.జుమ్మి ఫౌండేషన్ భవిష్యత్తులో కూడా ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తుందని నిర్వాహకులు తెలిపారు.



# రోడ్డు వెడల్పు చేసేందుకు ఆర్ అండ్ బి అధికారులు ఆదేశాలు

**- జగన్నాధపురం రోడ్డు సెంటర్ నుండి 50 అడుగులు వెడల్పు**
**- పోలీస్, గ్రామపంచాయతీ అధికారుల సమక్షంలోనే మార్కింగ్**





ములకలపల్లి, సూర్య (మేజర్ న్యూస్)- మండల పరిధిలో ప్రధాన వ్యాపార కూడలిగా ఉన్న జగన్నాధపురం లోని ప్రధాన రహదారని వెడల్పు చేసేందుకు ఆర్ అండ్ బి అధికారులు రహదారికి ఇరువైపులా ఉన్న వ్యాపారస్తులకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం ఈ మేరకు ఆర్ అండ్ బి. డి ఈ విశ్వనాథం, ఏ ఈ సురేష్, సర్కిల్ ఇన్స్పెక్టర్ సతీష్, ఎస్సై మధు ప్రసాద్, జగన్నాధపురం గ్రామ సర్పంచ్ కుంజ వినోద్, గ్రామ కార్యదర్శి ఇబ్రహీం ల పర్యవేక్షణలో గ్రామంలోని ప్రధాన రహదారిపై కొలతలు వేశారు. జగన్నాధపురం సెంటర్లో గల ప్రధాన రహదారి కి ఇరువైపులా వ్యాపారస్తులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న వ్యాపార సముదాయాల యజమానులకు వారం రోజులు లోపల ఎవరికి వారు కొలతలు ప్రకారం తమ భవనాలను, ఇళ్లను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే పాల్వంచ నుండి ములకలపల్లి మీదుగా దమ్మపేట వరకు ఉన్న ఆర్ అండ్ బి రహదారిని 100 అడుగుల మేరకు వెడల్పు చేస్తున్నట్లు ఆర్ అండ్ బి డి ఈ పేర్కొన్నారు. ఈ క్రమంలోనే జగన్నాధపురం సెంటర్లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపార సముదాయాలను సెంటర్ వరకు చొచ్చుకు రావటంతో వాహనాల రాకపోకలకు అనేక ఇబ్బందులు గురవుతున్నాయి. నిత్యం వందలాది లారీలు, ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేట్ వాహనాల రాకపోకలు విపరీతంగా పెరిగిపోయాయని పలువురు పేర్కొన్నారు. జగన్నాధపురం లోని రోడ్డుకు సెంటర్ నుండి 50 అడుగులు తప్పనిసరిగా ఉండాలంటూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆర్ అండ్ బి అధికారులు కొలతలు వేసి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లకు మార్కింగ్ ను వేశారు. ఇది ఇలా ఉండగా జగన్నాధపురం గ్రామంలోని ప్రధాన రహదారి రాకపోకలకు ఇబ్బందులుగా ఉన్నాయని గ్రామ సర్పంచ్ కుంజా వినోద్ గతంలోనే వ్యాపారస్తులకు నోటీసులు జారీ చేసినప్పటికీ వ్యాపారులు తమకేమీ పట్టనట్లు అవకరించారు ఆరోపణ సైతం వినిపిస్తున్నాయి. వ్యాపార కూడలిగా ఉన్న జగన్నాధపురం లో రోడ్డు వెడల్పు చేసేందుకు అధికారులు ముందుకు రావడం పట్ల చుట్టుపక్కల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జగన్నాధపురం చుట్టూఉన్న పలు గ్రామాల నుంచి నిత్యం వందలాది మంది ప్రజలు రాకపోకలు కొనసాగిస్తుంటారు. ఏది ఏమైనా ఆర్ అండ్ బి అధికారులు ఏర్పాటు చేసిన కొలతలు మేరకు ఎవరికి వారు తమ ఇళ్ళ ముందు ఆక్రమణలు తొలగించుకోవాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ సతీష్, గ్రామపంచాయతీ కార్యదర్శి ఇబ్రహీం ఆదేశాలు జారీ చేయడం గమనార్హం.

## గుండెపోటుతో మాజీ చైర్ పర్సన్ మృతి



టేకులపల్లి సూర్య (మేజర్ న్యూస్)-ఖమ్మం ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ ఛైర్పర్సన్ గోనెల విజయలక్ష్మి(78) గుండెపోటుతో గురువారం మృతి చెందారు. ఆమె స్వస్థలం మండలంలోని ముత్యాలంపాడు గ్రామం. 2006లో టేకులపల్లి జడ్పీటీసీ సభ్యురాలిగా ఆమె గెలుపొందారు. కాంగ్రెస్, తెదేపాకు సమాన సీట్లు రావడంతో టాస్ ద్వారా ఖమ్మం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గా ఆమె ఎన్నికయ్యారు. 1980 నుంచి 1990 వరకు కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా కొనసాగిన ఆమె భర్త గోనెల వెంకటనారాయణ. 1991లో ప్రత్యర్థుల చేతిలో హత్యకు గురయ్యారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న టీబీజీకేఎస్ నేత కుసాన వీరభద్రం



కొత్తగూడెం, సూర్య (మేజర్ న్యూస్)-కొత్తగూడెం పట్టణంలో గల కొత్తగూడెం క్లబ్ నందు మందారపు జగన్ మోహన్ రావు రమా కుమారి ల దంపతుల కనిష్ట పుత్రుడు తారక రామ నాగ చంద్ర తేజ వెడ్స్ అనూష వివాహ వేడుకలలో టీబీజీకేఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కుసాన వీరభద్రం పాల్గొని నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదిస్తూ విషెస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యలమద్ది జనార్ధన్ , గనిగెళ్ళ వీరస్వామి వారి స్నేహితులు బృందంతోపాటు బంధువులు పాల్గొన్నారు.

# ఈనెల 16వ తేదీన ఐఎఫ్టియు ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్

**-నాలుగు లేబర్ కో కోడులను వ్యతిరేకిస్తు చేస్తున్న ఆందోళనలను జయప్రదం చేయాలి**
**- ఐఎఫ్టియు కొత్తగూడెం ఏరియా కార్యదర్శి సంజీవ్**




కొత్తగూడెం సింగరేణి,సూర్య(మేజర్ న్యూస్) - కార్మికులకు ఉరితాళ్ళు గా మారే నాలుగు లేబర్ కోడులను వ్యతిరేకిస్తూ మార్చి 16న చలో కలెక్టరేట్ ను జయప్రదం చేయాలని ఐఎఫ్టియు కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి ఎన్ సంజీవ్ పిలుపునిచ్చారు. గురువారం ఈ మేరకు ఐఎఫ్టియు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐ ఎఫ్ టి యు జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా మార్చి 16న నాలుగు లేబర్ కోడ్ లను ఏప్రిల్ ఒకటి నుండి బలవంతంగా అమలు చేయాలని నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉరి తాళ్లుగా మారే ఈ నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని మార్చి 9న సింగరేణి కొత్తగూడెం హెడ్ ఆఫీస్ నందు మార్చి 16న చలో కలెక్టరేట్ కార్యాలయం జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ఏరియా నాయకులు కరుణ రాధా అధ్యక్షతన జరిగిన ప్రచారంలో ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు గౌని నాగేశ్వరావు కొత్తగూడెం ఏరియా కార్యదర్శి ఎన్ సంజీవ్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ నాలుగు లేబరు కోడ్ లు కార్మికులకు చాలా నష్టం చేసే విధంగా ఉందని ఎంతోమంది అమరుల త్యాగంతో సాధించుకున్న కార్మిక హక్కులు మొత్తం కూడా రద్దు చేయాలని నరేంద్ర మోడీ ప్రభుత్వం నిర్ణయించుకొని బలవంతంగా ఏప్రిల్ ఒకటి నుండి అన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలని హుఖం జారీ చేయడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని కొన్నారు. ప్రధానంగా కార్మికులను కట్టు బానిసలుగా చేయడం కోసం ఉపయోగపడే కోడ్లు అని వారన్నారు. కోడ్ అంటే బిజెపి, ఆర్ఎస్ఎస్ భాషలో హిందూ ధర్మ స్మృతులని దాని ప్రాముఖ్యంగా తీసుకొని మనుధర్మ కోడ్ ల పేర్లు పెట్టారని కార్మికుడికి యజమానికి ఎప్పుడు వివాదాల చట్టం మాత్రమే ఉంటుంది తప్పితే భార్యాభర్తల సంబంధం అక్కచెల్లెళ్ల సంబంధం అన్నదమ్ముల సంబంధం ఉండదని తెలిపారు. పెట్టుబడుదారులు కార్మికులు పరస్పర విరుద్ధ వర్గాలుగా ఉంటారన్న విషయాన్ని గుర్తు చేశారు. పని గంటల పని విధానం 12 గంటలకు పెంచారు అన్ని రాష్ట్రాలతో అంచనా వేసిన కేంద్ర ప్రభుత్వం నేడు జీవన ప్రమాణాల ప్రకారం కనీస వేతనం 174 మాత్రమే ఉన్నదని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నరసింహ రామకృష్ణ పాషా కరుణ సంధ్య హుస్సేన్ బి లక్ష్మి ప్రభాకర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రకృతి ఆశ్రమం ఆధ్వర్యంలో మేయర్ కు అభినందనలు

**- ప్రకృతిని పర్యావరణాన్ని కాపాడండి ...సభ్యుల వినతి**



కొత్తగూడెం,సూర్య (మేజర్ న్యూస్)-ఇటీవల జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో కొత్తగూడెం మేయర్ గా ఎన్నికైన మూడ్ గణేష్ ను కొత్తగూడెం ప్రకృతి ఆశ్రమం ఆధ్వర్యంలో సభ్యులు గురువారం ఆయన ఛాంబర్ లో పట్టు ఫ్యాల్వతో ఘనంగా సన్మానించి, మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా పర్యావరణవేత్త మొక్కల వెంకటయ్య మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో పెంచే మొక్కలపైన అవగాహన కల్పించేందుకు తాము సిద్ధంగా ఉంటామని వెల్లడించారు. పదేపదే నాటడం మళ్ళీ తిరిగి నరకడం కాకుండా పకడ్బందీగా ప్లాన్ చేయాలని కోరారు. కోతుల సమస్యను అరికట్టేందుకు కొన్ని సలహాలను సూచనలను అందజేశారు. కొత్తగూడెంలో మోడల్గా కోతులకు ఫుడ్ కోర్టును ఏర్పాటు చేయడం ద్వారా, కోతల సమస్యను అరికట్టవచ్చని సూచించారు. గణేష్ మాట్లాడుతూ పర్యావరణ వేత్తల, ప్రకృతి ప్రేమికుల, ఉన్నతాధికారుల సూచనల సలహాల మేరకు దానికి పరిష్కారం త్వరలోనే కనుగొనేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. ప్రకృతిని పర్యావరణాన్ని కాపాడేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా సభ్యులు మేయర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ప్రకృతి ఆశ్రమం కోఆర్డినేటర్ జి. సుగుణారావు, పర్యావరణ వేత్త మొక్కల వెంకటయ్య, రిటైర్డ్ సింగరేణి జి.ఎం. శనగ వెంకటేశ్వర్లు, మన్ కీ బాత్ మొక్కల రాజశేఖర్, రామవరం పరిరక్షణ సమితి అధ్యక్షులు ముస్తఫా, మొక్కల ప్రేమికురాలు నైనిక రజువా, గౌరవ సభ్యులు దయసాగర్, బంగారీ శంకర్, నంది శశి కుమార్, జర్నలిస్టు శనగ రామచందర్, దశరధరజువా, ఝాన్సీ లు పాల్గొన్నారు.

# బంజారాల సమస్యలు పరిష్కరించండి




**పి ఓ కి వినతిపత్రం సమర్పించిన బంజారా సంఘాల జేఏసీ**

లక్ష్మీదేవిపల్లి,సూర్య (మేజర్ న్యూస్)– బంజారాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ, బంజారా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి రాహుల్ కు వినతిపత్రం సమర్పించారు. ఏజెన్సీ ప్రాంతంలో జివో నెం.3 ని పునరుద్ధరించి స్థానిక గిరిజనులతోనే ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని,షెడ్యూలు ఏరియా ప్రాంతంలో 1/70 యాక్ట్, పిసా చట్టం, ఎల్టిఆర్ చట్టాలను పకడ్బంధీగా అమలు చేయాలని పేర్కొన్నారు. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకేంద్రంలోని "శ్రీశ్రీశ్రీ సాతి భవాని" అమ్మవార్ల ఆలయ నిర్మాణం మరియు జాతర నిర్వహణ నిమిత్తం ఐదు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరారు.గిరిజన సాధు సంత్‌లకు ప్రత్యేకమైన బడ్జెట్‌ను కేటాయించాలని, తీజ్ పండుగ జరుపుకునేందుకు నిధులు కేటాయించాలని,భద్రాచలం రామాలయంలో హాతీరామ్ మఠంను ఏర్పాటు చేయాలని కోరారు.సేవాలాల్ మహారాజ్ జయంతికి ప్రభుత్వం ఇస్తున్న నిధులను సాధులచే జయంతి కార్యక్రమ నిర్వహణ నిమిత్తం ఖర్చు చేయించాలని,. ప్రతి మండల కేంద్రంలో సేవాలాల్ మహారాజ్ కమ్యూనిటీ భవనాల ఏర్పాటుకు స్థలం మంజూరు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.గిరిజన జిల్లా అయిన భద్రాద్రి కొత్తగూడెంలో సుమారు 4 లక్షలకు పైగా బంజారా జనాభా ఉందని,. భావితరాల వారికి బంజారా సంస్కృతి, సాంప్రదాయాలను అందించేందుకు జిల్లాలో బంజారాల సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకునేందుకు బంజారా మ్యూజియంను రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని కోరారు.అ దేవిధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయం మరియు భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలో గిరిజన బంజారాలకు సంబంధించిన చారిత్రక చిహ్నాలను నెలకొల్పాలని తెలిపారు.గిరిజనులకు ట్రైకార్ రుణాలపై ప్రభుత్వం స్పందించిన సకాలంలో నిధులు విడుదల చేసి గిరిజనుల అభ్యున్నతికి దోహపడాలని కోరారు.అనంతరం జేఏసీ వైస్ చైర్మన్ బానోత్ వీరు నాయక్, గణేష్ మహారాజ్, ప్రధాన కార్యదర్శి కాన్సిరామ్, కేశవ్ నాయక్, భద్రు నాయక్ ఆధ్వర్యంలో పిఓకి శాలువ సత్కారం చేశారు.

## ఈనెల 8న సేవాలాల్ మహారాజ్ అధికారిక జయంతి వేడుకలు

**–ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆదేశాలు**
**–జయంతి వేడుకల ఏర్పాట్ల సమావేశాలు**



లక్ష్మీదేవిపల్లి,సూర్య (మేజర్ న్యూస్)– కొత్తగూడెం నియోజవర్గ స్థాయి లో ప్రభుత్వం నిర్వహిస్తున్న సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఈనెల 8వ తేదీ ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న స్థల ప్రాంగణంలో సేవా లాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా తెలిపారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బంజారా సంఘాలు. వివిధ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు నిర్వహించుకునేందుకు తొమ్మిది కమిటీలను ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు నిర్వహణకు సంబంధించి కన్వీనర్ గా రమేష్ రాథోడ్. కో కన్వీనర్గా మాజీ కౌన్సిలర్ భూక్య శ్రీనివాస్ నాయక్ లు వ్యవహరించరున్నారు. ఈమేరకు సందర్భంగా కొత్తగూడెం తాసిల్దార్ పుల్లయ్యతో సమావేశం నిర్వహించి అధికారికంగా నిర్వహించనున్న సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు సంబంధించి పూర్తి వివరాలను తహసీల్దార్ వివరించడం జరిగింది. ప్రోటోకాల్ ను పాటిస్తూ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాల్సిందిగా తహసీల్దార్ సూచించారు. అనంతరం సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు నిర్వహించే స్థల పరిశీలనను కమిటీ సభ్యులు పరిశీలించారు. భోగ్ బండారు కార్యక్రమము ప్రాంగణం. అన్న ప్రసాదం నిర్వాణకు సంబంధించిన స్థలము. పార్కింగ్ ఏరియా లను పరిశీలించారు. కొత్తగూడెం నియోజవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో బంజారా సాధులు. పూజార్లు సర్పంచులు కార్పొరేటర్లు వివిధ కుల సంఘాల నాయకులు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు. ఉద్యోగ ఉపాధ్యాయ సంఘ నాయకులు. కార్మికులు. పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా ఉత్సవ కమిటీ కన్వీనర్ రమేష్ రాథోడ్, కో కన్వీనర్ శ్రీనివాస్ నాయక్ కోరారు.

# కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెకు పిలుపునిస్తాం.

– ఏ.సి.బి కేసు తో సంబంధం లేకుండా మెడికల్ బోర్డు ను వెంటనే నిర్వహించాలి
– కొత్త గనులను సింగరేణి కి కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం పై ఆందోళనలు.
– ఏఐటియుసి కేంద్ర కమిటి సమావేశంలో సీతారామయ్య, రాజ్ కుమార్ ల వెల్లడి.




కొత్తగూడెం సింగరేణి,సూర్య(మేజర్ న్యూస్)–సింగరేణి లో కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెకు పిలుపునిస్తామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ లు పేర్కొన్నారు. గురువారం గోదావరిఖని లో జరిగిన ఏఐటియుసి కేంద్ర కమిటి సమావేశంలో జరిగిన వివరాలను వారు వెల్లడించారు. సింగరేణి యాజమాన్యం గుర్తింపు సంఘం ఏఐటియుసి తో నవంబర్ 2024 , మార్చి 2025 లో జరిగిన స్ట్రక్చర్ కమిటీ సమావేశాల్లో పలు డిమాండ్ లను అంగీకరించి అమలు చేయడం లేదని వారు ఆరోపించారు. ముఖ్యంగా స్వంత ఇంటి పథకాన్ని, పెర్క్ పై ఇన్ కం టాక్స్ చెల్లింపు లపై సర్క్యులర్ లను జారీ చేయకుండా కార్మికుల ను మోసం చేస్తుందని వారు ఆరోపించారు. మెడికల్ బోర్డు ను ఏ.సి.బి విచారణ పేరుతో నిలిపి వేశారని వారు ఆరోపించారు. అనారోగ్యం వల్ల కార్మికులు చాలా మంది మెడికల్ బోర్డు కు దరఖాస్తు చేసుకొని సంవత్సరాలు గడిచినా ఇప్పటి వరకు మెడికల్ బోర్డు కు పిలువ కుండా కాలయాపన చేస్తూ కార్మికుల ను యాజమాన్యం ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు ఆరోపించారు. మారుపేర్ల విజిలెన్స్ కేసుల కార్మికుల డిపెండెంటు లకు ఉద్యోగాలు ఇవ్వకుండా యాజమాన్యం సమస్య రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉందని పరిష్కారం చూపకుండా నిర్లక్ష్యం చేయడం వల్ల వారికి ఉద్యోగాలు రావడం లేదని వారు ఆరోపించారు. జనరల్ సమ్మె లో పాల్గొన్న కాంట్రాక్టు కార్మికుల నుంచి జీతం రికవరీ చేస్తామని యాజమాన్యం ఆదేశాలు జారీ చేసిందని, దానిని వెంటనే రద్దు చేసి రికవరీ చేయొద్దని వారు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణి కి కొత్త గనులు ఇవ్వకుండా తెలంగాణ లో ఉన్న సింగరేణి సంస్థ ను నిర్వీర్యం చేస్తుందని వారు ఆరోపించారు. వేలం తో సంబంధం లేకుండా తెలంగాణ లో ఉన్న కొత్త గనులు సింగరేణి కి కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. సింగరేణి లో మైనింగ్, క్లరికల్, ట్రేడ్స్ మెన్ ల సమస్యల ను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే సింగరేణి వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, లేకుంటే సమ్మె కు పిలుపునిస్తామని వారు పేర్కొన్నారు. ఇంకా ఈ సమావేశంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, ఉప ప్రధాన కార్యదర్శులు కే.సారయ్య, వై.వి.రావు, ముస్కె సమ్మయ్య, మడ్డి ఎల్లా గౌడ్, కే.వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు అక్బర్ అలీ, కవ్వంపల్లి స్వామి, కందుకూరి రాజారత్నం, బ్రాంచ్ కార్యదర్శులు బాజీ సైదా, మల్లికార్జున్, రాంగోపాల్, రమేశ్, తిరుపతి, మల్లేష్, జీగురు రవిందర్, ఎం.ఆర్.సి రెడ్డి, రంగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## టీజీ జెన్ కో ఇంటెట్ ప్రాజెక్ట్ టేబుల్ టెన్నిస్, బాల్ బాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభం

పాల్వంచ,సూర్య(మేజర్ న్యూస్)– కేటీపీఎస్ 7 స్టేజిలో టీజీ జెన్ కో ఇంటెట్ ప్రాజెక్ట్ టేబుల్ టెన్నిస్, బాల్ బాడ్మింటన్ టోర్నమెంట్ గురువారం అట్టహాసంగా ప్రారంభం అయ్యాయి . రాష్ట్రం నలుమూలల జెన్ కో స్టేషన్స్ నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. కేటీపీ ఎస్ 7 స్టేజ్, కేటీపీ ఎస్ 5, 6 స్టేజెస్,బిటిపిఎస్ మణుగూరు, శ్రీశైలం, పులిచింతల, కేటీపీపీ భూపాలపల్లి, విద్యుత్ సౌధ, వైటిపిఎస్ దామరచర్ల నుండి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 7 స్టేజి ఇంచార్జి సిఈ జి . శ్రీనివాస్, 5,6 స్టేజెస్ సిఈ ఎం ప్రభాకరరావు, ఎస్ ఈ /సివిల్ ఎస్.యుగపతి, ఎస్ ఈ/సి హెచ్ పి జి.రాజ్ కుమార్, డివై .సిసిఏ నాగరాజు , స్పోర్ట్స్ ఆఫీసర్ లోహిత్ ఆనంద్, స్పోర్ట్స్ సెక్రటరీ /7 స్టేజి టి.మహేష్, స్పోర్ట్స్ సెక్రటరీ 5,6 స్టేజెస్ వీరస్వామి, ఇతర స్పోర్ట్స్ కమిటీ సభ్యులు హాజరు అయ్యారు.



# ప్రధాన ఆసుపత్రి ఉద్యోగులకు టీ సౌకర్యం వెంటనే పునరుద్ధరించాలి




**- సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (ఏబికేఎం ఎస్ బిఎంఎస్) డిమాండ్**
**- చీఫ్ మెడికల్ ఆఫీసర్ కు వినతిపత్రం అందజేత**

కొత్తగూడెం సింగరేణి,సూర్య (మేజర్ న్యూస్)- అనేక దశాబ్దాలుగా ప్రధాన ఆసుపత్రిలో పనిచేస్తున్న ఉద్యోగులకు చెల్లింపు (పేమెంట్) ప్రాతిపదికన ఉదయం, సాయంత్రం టీ సౌకర్యం అందుబాటులో ఉందని, ఈ సౌకర్యం చాలా కాలంగా అమలులో ఉండి, ప్రధాన ఆసుపత్రి సిబ్బందికి ఒక సాధారణ ఆమోదించబడిన కార్యాలయ సౌకర్యంగా కొనసాగుతోందని బిఎంఎస్ అనుబంధ సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ పేర్కొంది. అయితే, ఇటీవల యాజమాన్యం ఈ టీ సౌకర్యాన్ని నిలిపివేసినట్లు తెలిసి ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతోందని ఆ సంఘం తెలిపింది. ఆసుపత్రి ప్రారంభమైనప్పటి నుండి అనేక దశాబ్దాలుగా రోజువారీ పని దినచర్యలో భాగంగా కొనసాగుతున్న ఈ ఏర్పాటును అకస్మాత్తుగా నిలిపివేయడం ఉద్యోగుల్లో అసంతృప్తికి దారి తీసే ప్రమాదం ఉందని ఆ సంఘం ఆవేదన వ్యక్తం చేసింది.ప్రధాన ఆసుపత్రిలో పనిచేసే ఉద్యోగులు విధి నిర్వహణలో రోగులు, వారి కుటుంబ సభ్యులకు నిరంతరం సేవలందిస్తూ, అనేక అత్యవసర (ఎమర్జెన్సీ) పరిస్థితులను ఎదుర్కొంటూ పనిచేస్తుంటారని తెలిపింది. ఈ విధుల్లో శారీరక, మానసిక ఒత్తిడి అధికంగా ఉండటం సహజమని ఇలాంటి పరిస్థితుల్లో ఉదయం 10 గంటలకు, సాయంత్రం 4 గంటలకు టీ సౌకర్యం కల్పించడం ఉద్యోగులకు కొంత విశ్రాంతి కలిగించాలని పేర్కొంది.పని సామర్థ్యాన్ని కొనసాగించేందుకు దోహదపడుతుందని వివరించింది.ఈ సౌకర్యం చెల్లింపు ప్రాతిపదికన ఉండటం వల్ల సంస్థపై ఎటువంటి అదనపు ఆర్థిక భారం ఉండదని ఉద్యోగులు పేర్కొంటున్నారు. అందువల్ల దశాబ్దాలుగా అమలులో ఉన్న ఈ సౌకర్యాన్ని యథాతథంగా కొనసాగించాలని వారు కోరుతున్నారు.ఈ నేపథ్యంలో, సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ ఆధ్వర్యంలో సంఘం కార్పొరేట్ ఉపాధ్యక్షులు జి.వి. కృష్ణారెడ్డి నేతృత్వంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ కి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఈ విషయమై పి. మాధవ నాయక్ సీఎంఓ తో మాట్లాడగా వారు సానుకూలంగా స్పందించారని ఆ సంఘ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏబీకేఎంఎస్ జాతీయ కార్యదర్శి పి. మాధవ నాయక్, టి.ఎస్. పవన్ కుమార్, జీవీ కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు కార్పొరేట్ ఏరియా,సంగం చందర్ (పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు), తాల్లపెల్లి శ్రావణ్ కుమార్ గౌడ్ (పిట్ సెక్రటరీ), ఆదిశేషు,కోటేశ్వరరావు, ఆలీ,అజయ్ కుమార్, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

## మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో ట్రంప్ దిష్టిబొమ్మ దగ్ధం

**- ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ దురాక్రమణ దాడిని ఖండించండి**
**- ఇజ్రాయెల్, అమెరికాతో భారత్ దౌత్య, వాణిజ్య సంబంధాలు రద్దు చేసుకోవాలి**
**- సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ జాతీయ నాయకులు రంగారెడ్డి**



కొత్తగూడెం సింగరేణి,సూర్య (మేజర్ న్యూస్)- ఇరాన్ పై ఇ అమెరికా, ఇజ్రాయెల్ దురాక్రమణ దాడిని ఖండించాలని, ఇజ్రాయెల్, అమెరికాతో భారత్ దౌత్య, వాణిజ్య సంబంధాలు రద్దు చేసుకోవాలని సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ జాతీయ నాయకులు కెచ్చల రంగారెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ జాతీయ కమిటీ పిలుపుమేరకు కొత్తగూడెంలో గురువారం ట్రంప్ దిష్టిబొమ్మ దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ పశ్చిమ ఆసియాపై, ఆయిల్పై ఆధిపత్యం కోసమే ఇరాన్పై అమెరికా, ఇజ్రాయెల్ దురాక్రమణ దాడులకు, యుద్ధానికి దిగిందని,ఇది అత్యంత హేయమైన, అన్యాయమైన చర్య అని దుయ్యబట్టారు. ప్రపంచ ఆధిపత్య ధోరణి విధానంలో భాగంగానే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు.ఇరాన్ అధ్యక్షుడు ఖుమేదీని 30 అధునాతన అయిల్ బాంబులతో హత్య చేసినట్లు తెలుస్తోందని,నిన్న వెనుజుల అధ్యక్షుడు మదురోనీ ఎత్తుక పోయి ఆ దేశాన్ని అదుపులోకి తెచ్చుకున్నారని, మొన్న గాజానీ మరుభూమిగా మార్చారని అన్నారు.ఇవ్వాళ ఇరాన్ పై ఉన్మాద దురాక్రమణకు పూనుకున్నారని,ప్రపంచ వనరులు కొల్లగొట్టడానికి, ప్రపంచ వాణిజ్య, రాజకీయ, ఆర్థిక ఆధిపత్యం కోసం అమెరికా, దాని పెంపుడు జంతువు ఇజ్రాయెల్ మారణహోమం చేస్తూన్నా యని ఆరోపించారు. అంతేగాక రక్తపు చేతులతో మానవత్వం, ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నదని,ఇది నగ్నమైన అమానుష చర్యలకు దొంగ ముసుగు మాత్రమేనని అన్నారు.నరహంతకులతో చేతులు కలుపుకొని, ఆలింగనాలూ భారత దేశం చేసుకోవడమే రక్త, నరహంతక చర్యలలో భాగం కావడమేనని, మోడీ, ట్రంప్, నేతన్యాహు త్రయం జాతి విద్వేష విధానాలలో, నరహంతక చర్యలలో అన్నదమ్ములుగా మారారని, ఇది మన దేశ పౌర సమాజంకు అవమానం అని రెడ్డి తెలిపారు.భారత్ లాంటి అలీన దేశం. ప్రజాస్వామిక దేశం ప్రపంచ హంతకులతో చేతులు కలుపుకోవడం దేశ ప్రజలందరినీ అవమానించడమేనని రంగారెడ్డి అన్నారు. వెంటనే యుద్ధం ఆపాలని , అంతర్జాతీయ సంస్థలు జ్యోకం చేసుకోవాలని ,నరహంతకులతో మోడీ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలన్నీటిని రద్దు చేసుకోవాలని రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ముద్ద బిక్షం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జాటోత్ కృష్ణ, నూప భాస్కర్, జిల్లా నాయకులు గోపాలరావు బానోతు ధర్మ కల్లూరి కిషోర్ పోతుగంటి లక్ష్మణ్, పెద్ద బోయన సతీష్, వెంకటేశ్వర్లు, సరోజిని పద్మ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం



కొత్తగూడెం సింగరేణి,సూర్య (మేజర్ న్యూస్)-కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్,ను గురువారం మర్యాద పూర్వకంగా వారి కార్యాలయంలో కలవడం జరిగింది. ఈ సందర్భంగా సింగరేణి సంస్థ కొత్తగూడెం ఏరియాలో ఉన్న అండర్ గ్రౌండ్, ఉపరితల గనుల బొగ్గు ఉత్పత్తి ఉత్పాదికతలా వివరాములను, గనుల కార్యకలాపాలు, ఉద్యోగుల సంక్షేమం మరియు స్థానిక అభివృద్ధి కార్యక్రమాల గురించి కలెక్టర్‌కు వివరించారు.జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి సింగరేణి సంస్థ చేస్తున్న సేవలను జీఎం వివరించారు. గనుల ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణ, రోడ్లు, విద్య, వైద్య సేవలు వంటి సామాజిక అభివృద్ధి కార్యక్రమాలను మరింతగా విస్తరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కొత్తగూడెం ఏరియా లోని వీకే సిఎం ప్రాజెక్టు పనులలో కలెక్టర్ సహాయసహకారాలను కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సింగరేణి సంస్థ జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. సంస్థ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగించాలని, స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు పెంచే దిశగా మరింత చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిఎం తో పాటు జూనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్ మధుమిత ఇతర సంబధిత సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన నాగా సీతారాములు

సుజాతనగర్,సూర్య (మేజర్ న్యూస్)-హైదరాబాద్‌లో శంషాబాద్ ఎయిర్ పోర్టు సమీపంలో ని జిఎంఆర్ అరేనాలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తనయుడు సూర్య విక్రమాదిత్య, సాక్షిల వివాహ వేడుకకు టిపిసిసి జనరల్ సెక్రటరీలు నాగా సీతారాములు, హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు.ఆయనతో పాటు గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు నల్లపు.దుర్గాప్రసాద్ సేవాదళ్ నాయకులు కొదుమూరి దయాకర్,కాంగ్రెస్ పార్టీ నాయకులు అర్జున్ రావు,వీరబాబు యూత్ కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షులు షేక్ అబిద్ తదితరులు పాల్గొని వధువరులను ఆశీర్వదించారు.

